Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

సంపుటి : 01 సంచిక : 255 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ శుక్రవారం 10-10-2025 పేజీలు : 12 వెల : 2/-

## జీవో నెంబర్ 9పై

# హైకోర్టు స్టే



## - లోకల్ ఎన్నికలు జరిగేనా.?

-బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, హైకోర్టులో పిటిషన్లు దాఖలు

-రెండ్రోజుల పాటు సుదీర్ఘంగా వాదనలు

-జీవో అమలును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

-నిలిచిపోయిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9 పై హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌పై వివిధ పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషనర్లు తమ వాదనలో ప్రభుత్వ జీవో ద్వారా ఎన్నికల ప్రక్రియలో అన్యాయం జరుగుతోందని కొన్ని వర్గాలకు అనుకూలంగా మార్పులు జరిగాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రాథమిక విచారణ జరిపిన హైకోర్టు, జీవో నంబర్ 9( బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన) అమలుపై స్టే విధించింది. అంతే కాకుండా, గురువారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి విడుదలైన నోటిఫికేషన్‌పై కూడా స్టే విధించింది హైకోర్టు. కోర్టు తన ఆదేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వారాల వ్యవధిలో సమగ్ర కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. ఆ తర్వాత ప్రభుత్వం సమర్పించిన కౌంటర్ పై అభ్యంతరాలు తెలియజేసేందుకు పిటిషనర్లకు రెండు వారాల సమయం ఇచ్చింది. ఇక తదుపరి విచారణ ఆరు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది. దీంతో ఈ ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. హైకోర్టు తాత్కాలిక ఆదేశాల నేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై అస్పష్టత నెలకొంది. ఎన్నికల కమిషన్ అధికారులు కోర్టు ఆర్డర్ కాపీ అందిన తరువాత మాత్రమే తదుపరి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. దీంతో గ్రామ, మండల స్థాయిలో నిర్వహించాల్సిన ఎన్నికల షెడ్యూల్ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈ తీర్పుతో స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. కొందరు దీన్ని ప్రజాస్వామ్య పరిరక్షణగా చూస్తుండగా మరికొందరు ప్రభుత్వ విధానాలపై కోర్టు జోక్యాన్ని తప్పు పడుతున్నారు.

**అసలు ఏం జరిగింది.?**

తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు (బీసీ) సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినదే జీవో నంబర్ 9. ఈ ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా బీసీ రిజర్వేషన్ల శాతాన్ని 42 శాతానికి పెంచడం జరిగింది. జీవో నంబర్ 9 ప్రధాన ఉద్దేశం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా పెంచడం. గతంలో 25 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం ద్వారా సామాజిక న్యాయాన్ని సమకూర్చాలని ప్రభుత్వం ఉద్దేశించింది. ఈ పెంచిన రిజర్వేషన్లు ఎస్సీ (15 శాతం), ఎస్టీ (10 శాతం) రిజర్వేషన్లతో కలిపితే మొత్తం రిజర్వేషన్ల శాతం 67 శాతానికి చేరుతోంది. వివాదానికి మూల కారణం ఇక్కడే ఉంది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం దేశంలో మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతాన్ని మించకూడదు. జీవో 9 కారణంగా ఈ పరిమితి దాటడంతో ఇది చట్ట విరుద్ధమని పేర్కొంటూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. జీవో 9 పై సుదీర్ఘంగా వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బీసీ రిజర్వేషన్ల అమలుపై తాత్కాలికంగా స్టే విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ స్టే కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ, ముఖ్యంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు జరగాల్సిన నామినేషన్ల స్వీకరణ నిలిచిపోయింది. ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను పాటించడంలో సరిగా వ్యవహరించలేదనే

మిగతా 2లో



## దాడిపై సీజేఐ తొలి స్పందన

◆ రెండు రోజుల తర్వాత స్పందించిన జస్టిస్ గవాయ్

◆ ముగిసిపోయిన అధ్యాయంగా అభివర్ణించిన సీజేఐ

న్యూఢిల్లీ మధ్యప్రదేశ్ లోని ఖజురహోలో విష్ణుమూర్తి విగ్రహంపై కేసు విచారణ సందర్భంగా తాను అనని మాటల్ని సాకుగా చూపుతూ తనపై షూ విసిరిన లాయర్ వ్యవహారంపై సీజేఐ బీఆర్ గవాయ్ గురువారం తొలిసారి నోరువిప్పారు. తాజాగా సుప్రీంకోర్టులో తనపై లాయర్ రాకేష్ కిషోర్ దాడి చేయగానే స్పందించిన ఆయన, దీన్నో చిన్న విషయంగా తీసుకుని వాదనలు కొనసాగించాలని అక్కడే ఇతర లాయర్లకు సూచించారు. ఆ తర్వాత బార్ కౌన్సిల్ సదరు లాయర్ ను సస్పెండ్ చేసింది. గురువారం ఆ ఘటనపై తొలిసారి బహిరంగంగా మాట్లాడిన ఛీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అదో మర్చిపోవాల్సిన అధ్యాయమని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టులో మరో జడ్జి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కూడా స్పందించారు. ఈ ఘటనపై తనకు స్వంత అభిప్రాయాలు ఉన్నాయన్నారు. ఆయన ఓ సీజే అని, ఇది జోక్ కాదన్నారు. ఈ ఘటన జరగగానే సీజేఐ స్పందిస్తూ ఇవన్నీ చూసి డిస్టర్బ్ కావొద్దని, తాము డిస్టర్బ్ కాబోమని లాయర్లకు తెలిపారు. ఈ ఘటన తర్వాత ఢిల్లీ పోలీసులు సీజేఐపై షూ విసిరిన లాయర్ రాకేష్ కిషోర్ ను అదుపులోకి తీసుకున్నారు. మూడు గంటల పాటు ఆయన్ను విచారించారు. అయితే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఆయనపై కేసు నమోదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో పోలీసులు లాయర్ ను వదిలిపెట్టారు. ఆ తర్వాత బయటికి వచ్చిన

మిగతా 2లో



## రైతుకు లాభం, వినియోగదారుడికి మేలు

● వ్యవసాయ, అనుబంధ రంగాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి "రైతు పండించిన పంటకు సరైన ధర దక్కాలి, అదే సమయంలో ఆ పంటను కొనుగోలు చేసే వినియోగదారుడిపై అధిక భారం పడకూడదు. ఈ రెండింటినీ సమన్వయం చేయడమే మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు ఈ దిశగా కలిసి పనిచేసి, రైతులు, ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి అచ్చెన్నాయుడు, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు.

**మార్కెట్ యార్డుల ఆధునికీకరణకు మాస్టర్ ప్లాన్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 218 వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్రమైన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డుల పరిధిలోని ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. "మార్కెట్ యార్డుల్లో కోల్డ్ చైన్ వ్యవస్థలు, అగ్రి ప్రాసెసింగ్ యూనిట్లు వంటివి ఏర్పాటు చేయాలి. దీనివల్ల పంట నిల్వ సామర్థ్యం పెరిగి, రైతులకు మెరుగైన ధర లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. రైతు బజార్లను పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని, పట్టణ ప్రాంతాల్లో

మిగతా 2లో

## ఆర్టీసీ ఛార్జీల పెంపుపై బీఆర్ఎస్ పోరుబాట

ప్రభుత్వానికి కేటీఆర్, హరీష్ అల్టిమేటం



## పార్టీ పరమైన రిజర్వేషన్లా.? న్యాయపోరాటం కొనసాగింపా.?



-స్థానిక ఎన్నికలపై రేవంత్ ప్లానేంటి.?

## ఐరాస భద్రతామండలిలో భారత్ స్థానం పొందాలి

-బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్



## హైకోర్టు ఆదేశాల మేరకే వ్యవహరిస్తాం

-ఉత్తర్వులపై స్పందించిన ఎలక్షన్ కమిషన్






## స్థానిక ఎన్నికలు ఇజ్జత్ కా సవాల్

గెలిస్తేనే పలుకుబడి అన్న బండి సంజయ్

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సొంత పార్టీ నేతలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేయడంతో సమానమని, అంతకంటే నీచమైన పని

మిగతా 2లో

## వంద రోజుల్లో సమస్య పరిష్కరిస్తా

ఉప్పాడవాసులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హామీ



# జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే

వాదనలను పరిగణనలోకి తీసుకుంది హైకోర్టు. ఈ అంశంపై పూర్తి వివరణ, వాస్తవాలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌ను నాలుగు వారాలలోపు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ కూడా రెండు వారాలకు వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపిస్తూ సమగ్ర కులగణన ద్వారా లభించిన డేటా ఆధారంగానే రిజర్వేషన్లు పెంచామని ఇది ప్రజా సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం అని సమర్థించుకున్నారు. అయితే ఇప్పుడు ఈ రిజర్వేషన్ల భవితవ్యం, తద్వారా స్థానిక ఎన్నికల నిర్వహణ పూర్తిగా న్యాయపరమైన అంశాల పరిష్కారం పైనే ఆధారపడి ఉంది.

# దాడిపై సీజేఐ తొలి స్పందన

అతను, తనతో దేవుడే ఈ దాడి చేయించాడన్నారు. సనాతన ధర్మ వ్యతిరేకులపై దేవుడి ఆదేశాల మేరకే తాను దాడి చేసినట్లు చెప్పుకొచ్చాడు. మరోవైపు సీజేఐ గవాయ్ పై జరిగిన దాడిపై దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పక్షాలు స్పందించాయి. ప్రధాని మోదీ సహా కీలక నేతలంతా ఈ దాడిని ఖండించారు. ప్రధాని మోడీ ఆ తర్వాత సీజేఐతో నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. ఆయనకు సంఘీభావం తెలిపారు. అయితే సీజే మాత్రం ఈ విషయాన్ని పెద్దది చేయకూడదని భావిస్తుండటంతో సదరు లాయర్ విషయంలో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

# రైతుకు లాభం, వినియోగదారుడికి మేలు లక్ష్యం

అవసరమైన భూమిని అంచనా వేయాలని చెప్పారు. రైతు బజార్లకు అనుసంధానంగా మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేసే ఆలోచనను పరిశీలించాలని తెలిపారు. నిధుల సమీకరణ కోసం మార్కెట్ కమిటీలు, రైతు బజార్లను కలిపి ఒక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల పత్తికొండలో టమాటో ధరలు పడిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి పరిస్థితుల్లో పంటను నేరుగా రైతు బజార్లకు తరలించి ప్రజలకు అందుబాటు ధరలకు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు.

**రసాయనాలకు చెక్.. సేంద్రియ సాగుకు జై**

రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకంపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. "ఎక్కువ యూరియా వేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందనే అపోహతో రైతులు భూసారాన్ని దెబ్బతీస్తున్నారు. ఈ ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యం కూడా పాడవుతోంది. ఈ విధానానికి స్వస్తి పలకాలి" అని అన్నారు. 2026 ఖరీఫ్ నాటికి సేంద్రీయ సాగును గణనీయంగా పెంచేలా, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేలా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. భూసారాన్ని పెంచే పోషకాలపై దృష్టి సారించి, ప్రకృతి సేద్యం వల్ల కలిగే ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలను రైతులకు వివరించాలని చెప్పారు. రైతులకు అన్ని రకాల సేవలు అందించేలా రైతు సేవా కేంద్రాలను పునర్వ్యవస్థీకరించాలని తెలిపారు.

**రబీకి పక్కా ప్రణాళిక.. ఎరువుల పంపిణీపై కఠిన వైఖరి**

రబీ సీజన్‌కు ఎరువుల కొరత లేకుండా చూడాలని, పంపిణీలో పారదర్శకత పాటించాలని సీఎం స్పష్టం చేశారు. అధికారులు రబీకి 23 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ, "భూసార పరీక్షల నివేదికల ఆధారంగా రైతులకు ఎంత ఎరువు అవసరమో నిర్దేశించాలి. సాగు విస్తీర్ణాన్ని బట్టి సరఫరా జరగాలి. ఆధార్ ఆధారితంగానే యూరియా పంపిణీ చేసి, అక్రమ రవాణాను అరికట్టాలి. ప్రతి రైతు, కౌలు రైతుకు ఎంత యూరియా ఇచ్చారనే దానిపై పక్కా రికార్డులు నిర్వహించాలి" అని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ధాన్యం సేకరణ లక్ష్యం గత ఏడాదితో పోలిస్తే 44 శాతం అధికంగా 51 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్దేశించినట్లు అధికారులు తెలపగా, రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటలు.. అనుబంధ రంగాలపై దృష్టి**

ఈ సమీక్షలో, ప్రధాని ప్రారంభించనున్న 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'పై కూడా చర్చించారు. ఈ పథకం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. సెరికల్చర్ (పట్టు పరిశ్రమ) రంగంలో కర్ణాటకతో పోలిస్తే ఏపీ వెనుకబడి ఉండటంపై విశ్లేషణ చేయాలన్నారు. పట్టు ఉత్పత్తి యంత్రాలను ఎంఎస్ఎంఈల ద్వారా సబ్సిడీపై అందించాలని, ఈ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారం కూడా తీసుకోవాలని చెప్పారు. ఉల్లి, టమాటో, మిర్చి వంటి పంటల విషయంలో ధరలు పడిపోకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో జీలుగు బెల్లం, వెదురు ఉత్పత్తులను అరకు కాఫీ తరహాలో ప్రోత్సహించాలని, పుట్టగొడుగుల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి వివిధ పంటల మద్దతు ధరల పోస్టర్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు.

# పార్టీ పరమైన రిజర్వేషన్లా.? న్యాయపోరాటం కొనసాగింపా.?

తెలంగాణ రాజకీయాలు బీసీ రిజర్వేషన్ల చుట్టూ తిరుగుతున్నాయి. బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవో ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఇచ్చారు. నోటిఫికేషన్ కూడా గురువారం వచ్చింది. కానీ కోర్టు ఇచ్చిన స్టే కారణంగా రిజర్వేషన్లు చెల్లవు కాబట్టి ఎన్నికల ప్రక్రియ ఆగిపోయింది. కోర్టు ఆదేశాలను గౌరవిస్తామని ఎస్ఈసీ ప్రకటన చేసింది. ఇప్పుడు రేవంత్ ముందు స్థానిక ఎన్నికల నిర్వహణ విషయంలో రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి న్యాయపోరాటం కొనసాగించడం రెండు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలను నిర్వహించేయడం.

**ఎన్నికలు జరపాలనుకుంటే పార్టీ పరమైన రిజరవేషన్లతో నిర్వహణ**

స్థానిక ఎన్నిక ఎన్నికలను రేవంత్ నిర్వహించాలనుకుంటున్నారా, వద్దనుకుంటున్నారా అన్నదానిపైనే తదుపరి ప్రభుత్వ వ్యూహం ఆధారపడి ఉంటుందని అనుకోవచ్చు. స్థానిక ఎన్నికలను నిర్వహించాలనుకుంటే గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్ల జీవో ఆధారంగానే షెడ్యూల్ మార్చి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అలా చేస్తే రాజకీయపరమైన విమర్శలు, బీసీలను మోసం చేశారన్న ఆరోపణలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే దీనికి పరిష్కారంగా న్యాయపరమైన వివాదాలు ఉన్నాయి కాబట్టి పార్టీ పరమైన రిజర్వేషన్లు ఇస్తున్నామని బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఇతర పార్టీలు అదే విధంగా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేసే అవకాశం ఉంది. అలా చేయడం వల్ల ఎదురుదాడి చేయవచ్చు.

**ఎన్నికలు వద్దనుకుంటే న్యాయపోరాటం**

ఒక వేళ స్థానిక ఎన్నికలు ఇప్పుడు అవసరం లేదని, అదో తలనొప్పని రేవంత్ రెడ్డి అనుకుంటే న్యాయపోరాటానికి మొగ్గు చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం హైకోర్టు లో విచారణ జరగాలంటే నాలుగువారాలు పడుతుంది. అందుకే మంత్రి వాకిటి శ్రీహరి తాము సుప్రీంకోర్టుకు వెళ్తామని ప్రకటించారు. అలా వెళ్తే అక్కడ రిలీఫ్ వస్తుందని అనుకోవడానికి లేదు. ఎందుకంటే రిజర్వేషన్ల జీవోలో అన్ని సంక్లిష్టతలు ఉన్నాయి. న్యాయపోరాటం ఎంత కాలం సాగుతుందో చెప్పలేరు. అంత కాలం ఎన్నికలు నిర్వహించకుండా ఉండలేరు.

**ఎన్నికలు పెట్టకపోతే బ్యాక్ లాగ్‌లా ఉండిపోతాయి**

స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే బ్యాక్ లాగ్‌లా ఎప్పటికీ అలా ఉండిపోతాయి. ఎందుకంటే లోకల్ పోల్స్ కోసం గ్రామస్థాయి క్యాడర్ ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. గత పన్నెండేళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ క్యాడర్ కు రాజకీయ పరమైన పదవులు లేవు. గ్రామాల్లో, మండలాల్లో అధికారం లేదు. ఇప్పుడు ఆ అదికారాన్ని కోరుకుంటున్నారు. ఎలాగైనా ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావాలన్నా ఎన్నికలు నిర్వహించక తప్పని పరిస్థితి. ఎన్నికలను వాయిదా వేసుకుంటూ పోతే భారంగా మారతాయి కానీ ప్లస్ అయ్యే అవకాశాలు ఉండవు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి కూడా వీలైనంత త్వరగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తారని దానికి ప్లాన్ బీ అమలు చేస్తారని గట్టిగా నమ్ముతున్నారు. ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారన్నది రెండు, మూడు రోజుల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# వంద రోజుల్లో సమస్య పరిష్కరిస్తా

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో ఉప్పాడ ప్రాంత మత్స్యకారులతో 'మాట-మంతి' కార్యక్రమం నిర్వహించారు. సముద్ర కాలుష్యం, తీర కోత, మత్స్యకారుల ఇబ్బందులు వంటి కీలక సమస్యలపై విస్తృత చర్చ జరిగింది. వేటకు వెళ్లి మృతి చెందిన 18 మత్స్యకారుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున బీమా చెక్కులు అందజేశారు. పారిశ్రామిక వ్యర్థాల వల్ల సముద్రకాలుష్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఆడిట్ చేపట్టాలని ఆదేశించారు. వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. 100 రోజుల్లో సమస్యల పరిష్కారానికి మత్స్యకారులతో కలిసి నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యకారుల ప్రతినిధులు సముద్రంలో కలిసే పారిశ్రామిక వ్యర్థాల వల్ల చేపలు మరణిస్తున్నాయని, తమ జీవనోపాధి ప్రభావితమవుతోందని తెలిపారు. తీర కోత, మత్స్య సంబంధిత సహాయాలు, బీమా వ్యవస్థలలో లోపాలు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. పవన్ కళ్యాణ్ మత్స్యకారుల ప్రతి సమస్యను శ్రద్ధగా విని, అధికారులతో నోట్ చేయించారు. "మీ సమస్యలు మా ప్రాధాన్యత. పరిశ్రమలు, మత్స్య శాఖ, పీసీబీ, ఎన్జీవోలు, మత్స్యకారులు అందరినీ భాగస్వాములను చేసి, 100 రోజుల్లో పరిష్కార మార్గాలు సూచిస్తాం" అని భరోసా ఇచ్చారు. పీసీబీ అధికారులు పారిశ్రామిక కాలుష్యంపై వెంటనే ఆడిట్ చేపట్టి, వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వేటకు వెళ్లి మరణించిన 18 మంది కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 90 లక్షలు చెక్కులు పంపిణీ చేశారు. ఉప్పాడ తీరప్రాంతంలో పారిశ్రామిక ప్రదేశాల వల్ల సముద్ర నీటి కలుష్యం పెరిగింది. చేపలు మరణించడం, మత్స్యకారుల ఆదాయం తగ్గడం వంటి సమస్యలు గత కొన్ని నెలలుగా కొనసాగుతున్నాయి.ప్రభుత్వం ఇప్పటికే ఈ సమస్యలపై కమిటీ ఏర్పాటు చేసింది. పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా కాకినాడకు చేరుకుని, భారీ బందోబస్తు మధ్య సమావేశం జరిగింది. కలెక్టరేట్ సమావేశం ముగిసిన తర్వాత, మత్స్యకారులు, స్థానిక నాయకులతో మరిన్ని చర్చలు జరిగాయి.

# ఆర్టీసీ ఛార్జీల పెంపుపై బీఆర్ఎస్ పోరుబాట

తెలంగాణలో ఆర్టీసీ ఛార్జీల పెంపును బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పేరుతో కుటుంబంపై పెను భారం మోపుతున్నారని, ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే కుట్ర జరుగుతోందని నేతలు ఆరోపించారు. ఛార్జీల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు బస్ భవన్ ముట్టడికి యత్నించారు. అయితే కీలక నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అయినప్పటికీ కేటీఆర్, హరీష్, సహా కొద్ది మంది నేతలు ఆర్టీసీ బస్‌లలో ప్రయాణించి బస్‌భవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎండీని కలిసి వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ మార్గం నుంచి , మాజీ మంత్రి హరీష్‌రావు మెహదీపట్నం నుంచి , పద్మారావుగౌడ్ ఇంకో పక్క నుంచి బస్‌లు ఎక్కి బస్ భవన్‌కు చేరుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి టికెట్ తీసుకున్న నేతలు ప్రభుత్వం తీసుకున్న ఛార్జీల పెంపు నిర్ణయంతో ఒక్కో కుటుంబంపై నెలకు వెయ్యి రూపాయల వరకు భారం పడుతుందని అన్నారు. మహిళలకు ఉచితం అంటూనే మిగతా వారి నుంచి భారీగా వసూలు చేస్తున్నారని అన్నారు. ఇది సరికాదని ఆర్టీసీ నష్టాల్లో ఉంటే కచ్చితంగా దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డారు. దీనికి ప్రజలపై భారం వేయడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు.వివిధ ప్రాంతాల నుంచి బస్ భవన వద్దకు బీఆర్ఎస్ నేతలు చేరుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఆర్టీసీ కార్యాలయంలోకి వెళ్లేందుకు నేతలు యత్నించారు. అప్పటికే పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని నియంత్రించారు. నేతలతో అధికారులు చర్చించి కేవం నలుగురిని మాత్రమే ఎండీతో సమావేశమయ్యేందుకు అంగీకరించారు. దీనికి బీఆర్ఎస్‌నేతలు కూడా ఓకే చెప్పారు. పోలీసుల సూచన మేరకు కేటీఆర్, హరీష్‌రావు, పద్మారావు గౌడ్ ఎండీని కలిశారు. ఆర్టీసీ ఛార్జీల పెంపు, ప్రైవేటీకరణ ఆరోపణలు, ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇతర సమస్యలపై చర్చించారు. బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లారు. ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీని కోసం ఎంత దూరమైన వెళ్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే ఐదారుసార్లు బస్ ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. ఓవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ప్రజలపై భారాన్ని మోపుతున్నారని అన్నారు. అంతేకాకుండా ఆర్టీసీ స్థలాలను అమ్మకానికి పెడుతున్నారని మండిపడ్డారు. కొన్నింటిని తాకట్టు పెట్టి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అన్నారు. అన్ని విధాలుగా ఆర్టీసి పూర్తిగా నాశనం చేసి ప్రైవేటుపరం చేయాలని ప్లాన్ చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ ఆస్తులు తాకట్టు పెడుతున్న ప్రభుత్వం కార్మికులకి కూడా మంచి చేయడం లేదన్నారు బీఆర్ఎస్ నేతలు. వారికి రావాల్సిన బకాయిలను ఇంత వరకు ఇవ్వలేదన్నారు. మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీకి ఇవ్వాల్సిన బకాయిలు కూడా చెల్లించడం లేదని మండిపడ్డారు. అటు ప్రజలు, ఇటు కార్మికులను కలుపుకొని వెళ్లి ఉద్యమిస్తామని వార్నింగ్ ఇచ్చారు.

# భారత ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలినా కీలక వ్యాఖ్యలు

ప్రపంచ ఆర్థిక సమీకరణాలు మారుతున్న ప్రస్తుత తరుణంలో, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ వృద్ధికి కీలక ఇంజిన్‌గా మారిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియేవా ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధి రేటు నెమ్మదిస్తున్నప్పటికీ, భారత్ మాత్రం స్థిరంగా దూసుకెళుతోందని ఆమె పేర్కొన్నారు.వచ్చే వారం వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వార్షిక సమావేశాలు జరగనున్న నేపథ్యంలో జార్జియేవా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచవ్యాప్తంగా వృద్ధి సరళిలో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా చైనా వృద్ధి క్రమంగా మందగిస్తుండగా, భారత్ ఒక కీలక వృద్ధి చోదక శక్తిగా అభివృద్ధి చెందుతోంది" అని ఆమె వివరించారు. కరోనాకు ముందు ప్రపంచ వృద్ధి రేటు 3.7 శాతంగా ఉండగా, ప్రస్తుతం మధ్యకాలికంగా అది 3 శాతం వద్దే కొనసాగుతుందని అంచనా వేశారు.అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థలు అనేక ఒడిదొడుకులను తట్టుకుని నిలబడ్డాయని చెబుతూనే, ఇంకా పూర్తిస్థాయిలో పరీక్షలు ఎదురుకాలేదని, కాబట్టి ఇప్పుడే ఊపిరి పీల్చుకోవడం తొందరపాటు అవుతుందని ఆమె హెచ్చరించారు.ఐఎంఎఫ్ మాత్రమే కాకుండా ఇతర ప్రముఖ ఆర్థిక సంస్థలు కూడా భారత్‌పై సానుకూల దృక్పథంతో ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు, 2026 ఆర్థిక సంవత్సరానికి గాను భారత వృద్ధి అంచనాను 6.3 శాతం నుంచి 6.5 శాతానికి పెంచింది. ఇదే బాటలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కూడా 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి సవరించింది.గత వారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, జీఎస్టీ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు, బలమైన ప్రైవేట్ వినియోగం, స్థిర పెట్టుబడుల కారణంగానే ఈ వృద్ధి సాధ్యమవుతోందని తెలిపారు. 2025-26 మొదటి త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం మేర బలమైన వృద్ధిని నమోదు చేసిందని ఆయన గుర్తు చేశారు. మంచి వర్షపాతంతో గ్రామీణ డిమాండ్ బలంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో కూడా డిమాండ్ క్రమంగా పుంజుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికలు ఇజ్జత్ కా సవాల్

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సొంత పార్టీ నేతలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేయడంతో సమానమని, అంతకంటే నీచమైన పని మరొకటి ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో ఈరోజు ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "నాకు ఎలాంటి గ్రూపులూ లేవు, బీజేపీయే నా గ్రూప్. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసమే ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలి" అని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు తమ సొంత గ్రామాల్లో, మండలాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే వారికి గౌరవం, పలుకుబడి ఉంటాయని తేల్చిచెప్పారు.

అభ్యర్థుల ఎంపికపై మాట్లాడుతూ, "గెలుపు అవకాశాలే ప్రామాణికంగా సర్వే నివేదికల ఆధారంగా రాష్ట్ర నాయకత్వమే అభ్యర్థులను ప్రకటిస్తుంది. ఈ విషయంలో నా అభిప్రాయం మాత్రమే అంతిమం కాదు" అని స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ, ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, టిక్కెట్లు ఆశించే వారు నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వమే నిధులు అందిస్తోందని బండి సంజయ్ అన్నారు. "దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గ్రామానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిధులిచ్చిన ఏకైక ఎంపీని నేనే. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలకు నయా పైసా ఇవ్వడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కేంద్ర నిధులను దారి మళ్లించి పల్లెలను నాశనం చేసింది" అని ఆయన ఆరోపించారు. అటువంటప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలకు ఏం ప్రయోజనం ఉంటుందని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటు అభ్యర్థించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## ఐరాస భద్రతామండలిలో భారత్ స్థానం పొందాలి

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం దక్కాలన్న వాదనకు బ్రిటన్ నుంచి బలమైన మద్దతు లభించింది. ప్రపంచ వేదికపై భారత్ తన 'సరైన స్థానాన్ని' పొందాలని యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ గురువారం స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో సమావేశమైన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధిని, అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించగల సామర్థ్యాన్ని స్టార్మర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "భద్రతా మండలిలో భారత్ తన హక్కుగా పొందాల్సిన స్థానాన్ని దక్కించుకోవడాన్ని మేము చూడాలనుకుంటున్నాం" అని ఆయన అన్నారు. భారత్ శాశ్వత సభ్యత్వానికి ఇప్పటికే అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, రష్యా వంటి దేశాలు మద్దతు తెలుపగా, ఇప్పుడు యూకే కూడా అదే బాటలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

తన భారత పర్యటన ఉద్దేశాన్ని వివరిస్తూ, గత దశాబ్ద కాలంలోనే అతిపెద్ద వాణిజ్య ప్రతినిధి బృందంతో తాను ఇక్కడికి వచ్చినట్లు స్టార్మర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో భారత్, యూకేలు ప్రపంచ నాయకులుగా కలిసి నిలుస్తున్నాయని చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా యూకేలో బాలీవుడ్ చిత్రాల నిర్మాణానికి సంబంధించి ఒక ఒప్పందం కుదిరిందని కూడా ఆయన ప్రకటించారు. ఇదే సమయంలో, గాజాలో శాంతి ఒప్పందం మొదటి దశకు చేరుకోవడం పట్ల స్టార్మర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఎంతో ఉపశమనం కలిగించే క్షణమని, ఈ శాంతి ప్రణాళిక పూర్తిస్థాయిలో అమలు కావడానికి యూకే మద్దతుగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## హైకోర్టు ఆదేశాల మేరకే వ్యవహరిస్తాం

## ఉత్తర్వులపై స్పందించిన ఎలక్షన్ కమిషన్

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) దీనిపై అధికారికంగా స్పందించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో నంబర్ 9 అమలుపై, ఈ రోజు విడుదలైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను తాము పాటిస్తామని ఎస్ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యదర్శి గురువారం ప్రెస్ నోట్ విడుదల చేశారు.

**ఎన్నికల సంఘం నిర్ణయం..**

తెలంగాణ హైకోర్టు నుంచి ఆర్డర్ కాపీ అందిన వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. హైకోర్టు ఈ అంశంపై తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. దీంతో ఆ గడువు ముగిసే వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండబోదని. సడలింపు లభించినట్టేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో లేకపోవడం వల్ల ప్రభుత్వ కార్యకలాపాలు, అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ పథకాల అమలుపై ఉన్న నియంత్రణలు తాత్కాలికంగా తొలగిపోతాయి. ఈ వాయిదా కాలంలో రాజకీయ పార్టీలు కూడా తమ ప్రచార వ్యూహాలను తిరిగి సమీక్షించుకోవడానికి, అభ్యర్థుల ఎంపిక విషయంలో పునరాలోచన చేయడానికి అవకాశం లభించింది.

**ఆశావహుల్లో తీవ్ర నిరాశ..**

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ముఖ్యంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల నుంచి పోటీ చేయాలని ఆశించిన వేలాది మంది నాయకులు, కార్యకర్తలు ఈ తీర్పుతో తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు. గురువారం ఉదయం మొదటి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాగా నామినేషన్లు దాఖలు చేయడానికి అంతా సిద్ధమై ఉన్న ఆశావహులు ఈ కోర్టు స్టే తో షాక్‌కు గురయ్యారు. జిల్లాలలోని ఆయా పార్టీ కార్యాలయాల వద్ద నోటిఫికేషన్ సందడి కారణంగా నాయకులు మద్దతుదారులతో కోలాహలం నెలకొంది. అయితే హైకోర్టు తీర్పు వెలువడగానే ఆ సందడి ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయింది. అభ్యర్థిత్వం ఖరారైన తమ పార్టీ నాయకులతో మాట్లాడి నామినేషన్ పత్రాలు సమర్పించాలని ఆసక్తిగా ఎదురుచూసిన వారంతా ఈ పరిణామంతో తమ తమ నివాసాలకు వెనుదిరగాల్సి వచ్చింది. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం తదుపరి ఎలాంటి న్యాయ పోరాటం చేస్తుందోననే ఉత్కంఠ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో నెలకొంది.

## ఆ విమానం కూలిపోవడడానికి కారణం మేమే: పుతిన్

గతేడాది అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ప్రయాణికుల విమానం కూలిపోయిన ఘటనలో తమ వైమానిక దళం పాత్ర ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తొలిసారి బహిరంగంగా అంగీకరించారు. ఈ దుర్ఘటనలో 38 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్‌తో బాకూలో జరిగిన సమావేశంలో పుతిన్ ఈ కీలక ప్రకటన చేశారు. ఏడాది కాలంగా ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన ఈ ఘటనపై పుతిన్ తాజా అంగీకారం ప్రాధాన్యత సంతరించుకుంది.2024 డిసెంబర్ 25న అజర్‌బైజాన్ రాజధాని బాకూ నుంచి 67 మంది ప్రయాణికులతో చెచెన్యాలోని గ్రోజ్నీ నగరానికి బయలుదేరిన అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం రష్యా గగనతలంలో ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో రష్యా వైమానిక దళం ఉక్రెయిన్‌కు చెందిన డ్రోన్‌లను లక్ష్యంగా చేసుకుని క్షిపణులను ప్రయోగించింది. ఆ క్షిపణులు పౌర విమానానికి అత్యంత సమీపంలో పేలిపోవడంతో, వాటి శకలాలు విమానాన్ని బలంగా తాకాయి. దీంతో విమానం తీవ్రంగా దెబ్బతింది. పైలట్లు అత్యవసరంగా కజకిస్థాన్‌లో ల్యాండ్ చేయడానికి ప్రయత్నించినా విఫలమై విమానం కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో 38 మం అక్కడికక్కడే మరణించగా, మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. అధ్యక్షుడు అలియెవ్‌తో భేటీ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ, "ఆ విమాన ప్రమాదంలో మా వైమానిక దళం ప్రమేయం ఉన్న మాట వాస్తవమే. ఇది చాలా బాధాకరమైన సంఘటన" అని భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం ఫోన్ సంభాషణ జరిగింది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కుదిరిన చారిత్రక గాజా శాంతి ప్రణాళిక విజయవంతం కావడం పట్ల ట్రంప్‌కు ప్రధాని మోదీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. అదే సమయంలో, ఇరు దేశాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య చర్చల్లో సాధించిన పురోగతిని కూడా ఇరువురు నేతలు సమీక్షించుకున్నారు.ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "నా మిత్రుడు, అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడాను. చారిత్రక గాజా శాంతి ప్రణాళిక విజయవంతమైనందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపాను. ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చల్లో సాధించిన మంచి పురోగతిని కూడా సమీక్షించాం. రాబోయే వారాల్లోనూ టచ్‌లో ఉండాలని అంగీకరించాం" అని మోదీ తన పోస్టులో పేర్కొన్నారు.నెల రోజుల వ్యవధిలో ఇరువురు నేతల మధ్య ఫోన్ సంభాషణ జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. సెప్టెంబర్ 16న ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా ట్రంప్ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా ఉక్రెయిన్ శాంతి చర్చల విషయంలో ట్రంప్ చొరవకు మోదీ మద్దతు ప్రకటించారు. దీనికి ట్రంప్ కూడా ధన్యవాదాలు తెలిపారు.

సత్యమేవ జయతే



# బీఆర్ఎస్ పార్టీలో చేరిన పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టి సెల్ అధ్యకుడు

**ఎస్టిలను ఆదుకున్నది బీఆర్ఎస్ పార్టీనే..**

**తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత మాజీ సీఎం కేసిఆర్ కే దక్కుతుంది..**

**కాంగ్రెస్ పార్టీలో ముందు నుంచి ఉన్న నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యం లేదు..**

**కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ అధికారంలోకి వచ్చాక న్యాయం జరగలేదు...**





సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టి సెల్ నాయకులు...దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యం లభించడం లేదని. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో విలువలేదని పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టి సెల్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వాపోయారు. ఈరోజు పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టి సెల్ నాయకులు కార్యకర్తలు ఎర్రగడ్డ తండాలో పైలెట్ రోహిత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత మాజీ సీఎం కేసిఆర్ కే దక్కుతుందని. ఎస్టిలను ఆదుకున్నది బీఆర్ఎస్ పార్టీనే అని వారు అన్నారు. పార్టీలో చేరిన వారిలో నారాయణ, శంకర్, గోపాల్, గోపాల్ చవాన్, మోహన్ సింగ్, జగన్, లక్ష్మణ్, రాము తదితరులు ఉన్నారు. వాటిలో చేరిన వారికి పైలెట్ రోహిత్ రెడ్డి గారు బిఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు.

## కాంగ్రెస్ అంటేనే మోసం..

**లికాంగ్రెస్ బాకీ కార్డు"తో ఇంటింటికీ ఇంటింటికీ తిరిగి ఏ వర్గానికి ఎంత బాకీ పడ్డారో కాంగ్రెస్ బాకీ కార్డులను పంచి, ప్రజలకు తెలియజేయాలి..**

## పైలెట్ రోహిత్ రెడ్డి...



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా...కాంగ్రెస్ బాకీ కార్డు" తో ఇంటింటికీ ఇంటింటికీ తిరిగి ఏ వర్గానికి ఎంత బాకీ పడ్డారో కాంగ్రెస్ బాకీ కార్డులను పంచి, ప్రజలకు తెలియజేయాలి అని పైలెట్ రోహిత్ రెడ్డి గారు అన్నారు. గురువారం తాండూరు లోని ఆయన నివాసంలో "కాంగ్రెస్ బాకీ కార్డు" లను ఆవిష్కరించారు. ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలను ఇచ్చి, అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని 22 నెలలు గడుస్తున్నా ఒక్క పథకమూ సక్రమంగా నెరవేర్చకుండా.. వాటి ఊసే ఎత్తకుండా ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు.అడ్డగోలు హామీలతో, అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, కాంగ్రెస్ ఒక్కొక్కరికి ఎంత బాకీ ఉందో చెప్పడానికి ఈ "కాంగ్రెస్ బాకీ కార్డు" బ్రహ్మాస్త్రంలా పని చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ బాకీ కార్డును గడపగడపకు తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని తాండూర్ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలు పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు..

## నార్త్ అమెరికా ఖండంలోని బార్బడోస్ లో పర్యటన చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బృందం.





సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..నార్త్ అమెరికా ఖండంలోని బార్బడోస్ దేశ రాజధాని బ్రిడ్జిటౌన్ లో జరుగుతున్న 68 వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సి పి ఏ కాన్ఫరెన్స్ లో పాల్గొంటున్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గారు, శాసనపరిషత్ చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ ముదిరాజ్ లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అధికారులు.మొదటిరోజు జరిగిన రిజిస్ట్రేషన్ మరియు పరిచయ కార్యక్రమాలలో భారతదేశ లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ శ్రీ హరివంశ నారాయణ సింగ్, రాష్ట్రాల స్పీకర్లు, చైర్మన్లతో కలిసి పాల్గొన్న తెలంగాణ శాసన బృందం.తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ మండల కేంద్రంలో ఫినో పేమెంట్స్ బ్యాంకులో

# ప్రారంభమైన ఆధార సేవలు




సత్యమేవ జయతే కొండాపూర్ మన కొండాపూర్ మండల కేంద్రంలో fino payments Bank loఆధార్ కేంద్రం సేవలు మళ్లీ ప్రారంభించబడ్డాయి.

1 ఇందులో చిన్న పిల్లలకు అనగా 5 సంవత్సరాలలోపు పిల్లలకు బర్త్ సర్టిఫికేట్ తీసుకొని వస్తే వాళ్లకి కొత్త ఆధార్ కార్డు చేయబడును అలాగే వాళ్ళ ఫాదర్ ది కూడా ఆధార్ కార్డు తీసుకొని రాగలరు

2. అదేవిధంగా ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ కూడా లింకు చేయబడును

3. అదేవిధంగా డేట్ అఫ్ బర్త్ మరియు అడ్రస్ చేంజ్ చేయబడును దానికి కావాల్సిన డాక్యుమెంట్లు డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ మరియు రెసిడెన్సి సర్టిఫికెట్ అనగా లోకల్ సర్టిఫికెట్ తీసుకుని రావాలని ఫినో పేమెంట్స్ బ్యాంకు మేనేజర్ జే భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య







సత్యమేవ జయతే/హత్నూర: సంగారెడ్డి జిల్లా మండలంలోని ఉన్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ ఏ టి సి సెంటర్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏటీసీ సెంటర్లో కొనసాగుతున్న బోధన విధానం, విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక శిక్షణను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. నేటి కాలంలో సాంకేతిక నైపుణ్యం కలిగినవారి కే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఏటీసీ లో అమలవుతున్న కోర్సులు, అధునాతన మిషనరీలు, అభివృద్ధి పనులపై వివరాలను సంబంధిత అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ ద్వారా అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్





సత్యమేవ జయతే/హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శుక్రవారం ఆకస్మిక పర్యటన తనిఖీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు . ఈ సందర్భంగా ఆసుపత్రి లో రోగులతో మాట్లాడారు . ఆస్పత్రిలో వైద్యులు రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. సీజన్ అయినందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నియంత్రించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పడిన వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమం లో. తహశీల్దార్ పర్వీన్ షేక్ ఎంపీడీవో . శంకర్ సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ లకు రేవంత్ రెడ్డి ఘరానా మోసం: వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్..

సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.బీసీ రిజర్వేషన్ల పైన రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూటకో మాట మాట్లాడారు.అసాధ్యమని తెలిసినా మాటల గారడీ చేసారు.

ఒకసారి కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ హడావుడి చేశారు. మరోసారి పార్టీపరమైన రిజర్వేషన్లు కల్పిస్తామని, ఆర్డినెన్స్ ద్వారా అమలు చేస్తున్నామని ఇలా పూటకో మాటతో ఇన్నాళ్లు కాలయాపన చేసారు.చివరకు చెల్లదని తెలిసినా కూడా ప్రజలను మోసం చేసేందుకు జీవో తెచ్చిన రేవంత్ రెడ్డి... ఆపై తన అనుచరులతో



కోర్టులో కేసు వేయించారు.కోర్టు లో స్టే వచ్చేలా రహస్య మంతనాలు చేసి, డ్రామాల మీద డ్రామాలు ఆడి ఎట్టకేలకు తాను అనుకున్నట్టుగానే బీసీలను మోసం చేశారు.లి వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం రేవంత్ రెడ్డి కి లేదు అందుకే ఇన్ని డ్రామాలకు పూనుకుని ప్రజలు మరియు నాయకుల విలువైన సమయాన్ని వృధా చేశారు. రేవంత్ రెడ్డి మీ కపట నాటకాలతో ఇన్నాళ్లు బీసీ లను మోసం చేసినందుకు వారి ఆగ్రహనికి గురికాక తప్పదు.

# వికారాబాద్ జిల్లాలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్లు వెంటనే బాగు చేయాలి. సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్...







సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా... వికారాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ పాల్గొని మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో మన్నెగూడ నుండి తాండూర్, బషీరాబాద్ , వికారాబాద్ నుంచి మర్ పల్లి మోమిన్ పెట్ వికారాబాద్ నుండి కోటిపల్లి బంటారం తౌర్మామిడి, జిల్లా ఆయా గ్రామాలకు, వికారాబాద్ నుండి జైదుపల్లి మోమిన్ కాలాన్ నాగారం యాలాలు బొంరాస్పేట్. వికారాబాద్ నుండి నవబ్ పెట్ ఆయా గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు ఆర్ అండ్ రోడ్లు గత 20 ఏళ్లుగా గుంతలమయం అయి చాలా అద్వానంగా తయారైనవి ప్రయాణికులు అనేకమంది ఇప్పటికే యాక్సిడెంట్లు తో చనిపోయిన పరిస్థితి జిల్లాలో నేటికి ఘటనలు అనేకం కనిపిస్తా ఉన్నాయి. ఇప్పటికే అనేకసార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన దున్నపోతు మీద వాన పడ్డట్లుగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది. ఇప్పటికైనా వికారాబాద్ ఎమ్మెల్యే శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డి, పరిగి తాండూర్ ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి పాడైన రోడ్లను వెంటనే బాగు చేయించాలని రోడ్ ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. లేని జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాల కొనసాగిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిచారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సభ్యులు సుదర్శన్ సతీష్ నవీన్ నాయకులు అక్బర్ లక్ష్మయ్య ప్రశాంత్ శ్రీనివాస్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జర్నలిస్ట్ పీట్ల శివకుమార్ జన్మదిన వేడుకలు





కుత్బుల్లాపూర్, అక్టోబర్ 9, సత్యమేవ జయతే ప్రతినిధి:-కుత్బుల్లాపూర్ సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ పత్రిక రిపోర్టర్ పీట్ల శివకుమార్ జన్మదిన వేడుకలు గురువారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగసానిపల్లి గ్రామంలోని ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తోటి జర్నలిస్టులు, మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని పీట్ల శివకుమార్ ని శాలువాలతో సత్కరించి,కేక్ కట్ చేయించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మాదగారి సుగ్రీవుడు ముదిరాజ్, సీనియర్ జర్నలిస్టులు బాన్సువాడ వెంకటేష్, వాసాల బాలరాజ్, ఎర్రం పెంటయ్య గుప్తా, కాసాని రంజిత్, నామమోహన్, కామేశ్వర్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... పీట్ల శివకుమార్ ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే దృఢమైన జర్నలిస్టుగా గుర్తింపు పొందారన్నారు. నిత్య నూతన కథనాలతో పత్రిక ప్రతిష్ఠను పెంచుతూ, ప్రజాసంక్షేమం కోసం ఎల్లప్పుడూ పాటుపడుతున్నారన్నారు.వనదుర్గ అమ్మవారి ఆశీస్సులతో ఆయనకు మరిన్ని విజయాలు, ఆరోగ్యం కలగాలని కోరుకుంటున్నామన్నారు.

ఈ వేడుకల్లో రవి ముదిరాజ్ తదితరులు పాల్గొని వేడుకను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించారు.

# దరువు అంజన్నకు సోషల్ ఎక్సలెన్స్ అవార్డు 2025







### సామాజిక సేవ రంగాలలో పాల్గొనడం గర్వనీయం

### దరువు అంజన్న చేసిన సమాజ సేవకు తగిన గుర్తింపు

### సమాజంలో స్వార్థం ఎక్కువైంది

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 9,సత్యమేవ జయతే ప్రతినిధి:-

మానవసేవే మాధవ సేవ అన్నారు పెద్దలు, కానీ నేడు సమాజంలో స్వార్థం ఎక్కువైందని మనిషిని మనిషిగా గుర్తించే రోజు లేదని అయితే దరువు అంజన్న లాంటివారు తన జీవితాన్ని సమాజానికి అంకితం చేసి సమ సమాజ సేవ చేయడం హర్షించదగ్గ విషయమని ముఖ్యఅతిథిగా విచ్చేసిన సేవా రత్న అవార్డు గ్రహీత వడ్లకొండ వెంకట్రావు అన్నారు, ప్రసన్న ఆరోహి ఆర్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ వారు సమాజ సేవ చేసిన వారికి ఇచ్చే అవార్డును 2025 గాను దరువు అంజన్నను ఎంపిక చేశారు, హైదరాబాదులో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో దరువు అంజన్నకు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసన్న ఆరోహి ఆర్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు ప్రసన్న ఆరోహి మాట్లాడుతూ... నేటి సమాజంలో అన్నదమ్ములు అక్క చెల్లెలు సైతం ఆర్థిక సంబంధాల కూపిలో మునిగిపోయి మానవ సంబంధాలు మర్చిపోతున్నారని, అందుకే మేము మా సంస్థ తరఫున సమాజ చేసిన వారికి, ఈ అవార్డు అందజేస్తామని ఈ సంవత్సరం దరువు అంజన్నను ఎంపిక చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అవార్డు గ్రహీత దరువు అంజన్న మాట్లాడుతూ... మానవ జన్మ ఎత్తినందుకు సమాజ సేవ చేయాలని అప్పుడే జన్మకు సార్థకత చేకూరుతుందని ఆయన హితువు పలికారు,

ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలువురు కళాకారులు పాల్గొని సంగీత కచేరి చేశారు.

# యూత్ ఐకాన్ చేగువేరా బాటలో యువత నడవాలి





### సత్య మేవ జయతే. నారాయణ ఖేడ్

### ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్

ఈరోజు (భారత విద్యార్థి ఫెడరేషన్ ) ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో చేగువేరా 58 వర్ధంతి సందర్భంగా నారాయణఖేడ్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో వాగ్దేవి కళాశాల లో చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ మాట్లాడుతూ.

అక్టోబర్ 9, ప్రపంచ విప్లవకారుడు, సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసిన ఎర్నెస్టో "చే" గువేరా యొక్క వర్ధంతి. 1967లో ఈ రోజున బొలీవియాలో ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారు, కానీ ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు, మరియు సామాజిక న్యాయం కోసం పోరాటం ఈ రోజూ ప్రపంచవ్యాప్తంగా అనేక మందికి యువతకు స్ఫూర్తినిస్తూనే చే గువేరా అన్నారు.

ఒక వైద్యుడిగా తన జీవితాన్ని ప్రారంభించినప్పటికీ, లాటిన్ అమెరికా మరియు ప్రపంచవ్యాప్తంగా అణగారిన వర్గాల స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారు. క్యూబా విప్లవంలో కీలక పాత్ర పోషించిన చే, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, సామాజిక సమానత్వం కోసం నిరంతరం కృషి చేశారు. ఆయన జీవితం యువతకు, సమాజంలో మార్పు కోసం పనిచేయాలనుకునే వారికి ఒక స్ఫూర్తిదాయక విప్లవకారుడు చే యొక్క త్యాగాన్ని, ఆదర్శాలను స్మరించుకుంటూ, సమాజంలో అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలని అదేవిధంగా ఆయన స్ఫూర్తితో, సమానత్వం, న్యాయం, మరియు మానవ హక్కుల యువత సమాజ మార్పు కోసం ఈ ప్రభుత్వాలపై పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు

ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ మాజీ కార్యదర్శి రమేష్ స్వరాజ్ యశ్వంత్ శ్రీనివాస్ రాజు విద్యార్థినిలు ఉన్నారు

# మనూర్ మండలానికి చెందిన బి ఆర్ ఎస్ ముఖ్య కార్యకర్తలకు దిశ నిర్దేశం







### స్థానిక సంస్థల ఎన్నికల కోసం బిఆర్ఎస్ పార్టీ సన్నద్ధం దిశా నిర్దేశంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి

సత్య మేవ జయతే. మనూర్నేడు మనూర్ మండలానికి సంబంధించిన అన్ని గ్రామాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముఖ్య కార్యకర్తలతో మండల కేంద్రంలో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి గారు. వారు మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు కార్యముక్తులై కంకణ బద్ధులై ముందు జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చని పతాకాలను ఇంటింటికి గడపగడపకు తీసుకెళ్లి వారి మనుగడను ఎండగట్టాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుండి ఎవరికైతే పోటీ చేస్తారో వారికి ప్రతి కార్యకర్త అండగా నిలిచి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఎవ్వరు కూడా బాధ బేధాలు పెట్టుకోకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. వారితో పాటు మండల నాయకులు మండల పార్టీ అధ్యక్షులు విఠల్ రావు పటేల్ మాజీ జడ్పీటీసీ నాగేందర్,మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీం,రాజశేఖర్ రెడ్డి,శివాజీ పటేల్,పండరి,సుధాకర్ పటేల్,నాగప్ప పటేల్, జైపాల్ రెడ్డి, శివకుమార్,జనార్దన్ రెడ్డి,అశోక్ రెడ్డి,ముజామిల్,నగేష్ సెట్,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే

శుక్రవారం 10 అక్టోబర్ 2025

## నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.







సత్యమేవ జయతే మోమిన్ పెట్: మోమిన్ పేట్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జడ్పిటిసి, ఎంపీటీసీ నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా విచ్చేసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... స్థానిక ఎన్నికల సందర్భంగా రెండు విడతలుగా జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 11 మండలాల్లో జడ్పిటిసి, 115 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎంపీటీసీ నామినేషన్లు వేసే క్రమంలో ఏవైనా సందేహాలను నివృత్తి చేసుకునేందుకు సిబ్బందిని కూడా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడతలో నిర్వహించే స్థానిక ఎన్నికలకు 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు వేసేందుకు గడువు ఉందని ఆయన తెలిపారు. జెడ్పిసి, ఎంపిటిసి నామినేషన్ల రిటర్నింగ్ అధికారుల గదులను కలెక్టర్ పరిశీలించారు.
కలెక్టర్ నామినేషన్ల ప్రక్రియను సందర్శించినప్పుడు మోమిన్ పేట రిటర్నింగ్ అధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సదానందం, తహసిల్దార్ రవీందర్, ఎంపీడీవో విజయలక్ష్మి, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

## బీసీ కులాల బిడ్డల ఆత్మాభిమానం పైన బడుగు బలహీన వర్గాల పైన నిర్దాక్షిణ్యంగా దండయాత్ర చేసిన రేవంత్ రెడ్డి

### బిఆర్ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు కిషోర్....



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..గత పది రోజుల కింద రిజర్వేషన్స్ ఖరారు చేసి 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తున్నానని ప్రగల్భాలు పలికిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలపై కపట ప్రేమ నేటితో తేటతెల్లమైందని ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు కిషోర్ ఆరోపించారు
బీసీలంతా ఆలోచన చేసే సమయం ఆసన్నమైంది అన్నారు, స్థానిక సంస్థల్లో సర్పంచులుగా ఎంపీటీసీలుగా జెడ్పిటిసిలుగా ఉంటాం అనుకున్న బీసీలు వాళ్ల కళ్ళల్లో కారం కొట్టినట్లుగా చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపే సమయం స్థానిక సంస్థల్లో బీసీలకు వచ్చిందన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రిజర్వేషన్లు ఇచ్చి కోర్టులో పిటిషన్ వేయించిందన్నారు. ఒకవైపు ఎలక్షన్లు జరుగుతున్నాయని కార్యకర్తలంతా సన్నద్ధమైతేవికారాబాద్ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ మాత్రం అమెరికా పర్యటనలో ఉన్నారు. అంటే, ప్రభుత్వానికి ముందే రిజర్వేషన్ల పై హైకోర్టు స్టే ఇస్తుందని తెలిసేమో అనే సందేహం వస్తుందన్నారురాబోయే రోజుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ఉద్యమిస్తామన్నారు..

## బి సి లకు రేవంత్ రెడ్డి ఘరానా మోసం. రేవంత్ రెడ్డి వెంటనే బి సి సమాజానికీ ష మాపణ చెప్పాలి.

### వికారాబాద్ మండల బి ఆర్ ఎస్ బీసీ సెల్ అద్యక్షులు . మల్లేష్ యాదవ్......



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా... బీసీ రిజర్వేషన్ల పైన రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూటకో మాట మాట్లాడారు. అసాధ్యమని తెలిసినా మాటల గారడీ చేసారు. ఒకసారి కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ హడావుడి చేశారు. మరోసారి పార్టీపరమైన రిజర్వేషన్లు కల్పిస్తామని, ఆర్డినెన్స్ ద్వారా అమలు చేస్తున్నామని ఇలా పూటకో మాటతో ఇన్నాళ్లు కాలయాపన చేసారు. చివరకు చెల్లదని తెలిసినా కూడా ప్రజలను మోసం చేసేందుకు జీవో తెచ్చిన రేవంత్ రెడ్డి... ఆపై తన అనుచరులతో కోర్టులో కేసు వేయించారు. కోర్టు లో స్టే వచ్చేలా రహస్య మంతనాలు చేసి, డ్రామాల మీద డ్రామాలు ఆడి ఎట్టకేలకు తాను అనుకున్నట్టుగానే బీసీలను మోసం చేశారు. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం రేవంత్ రెడ్డి కి లేదు అందుకే ఇన్ని డ్రామాలకు పూనుకుని ప్రజలు మరియు నాయకుల విలువైన సమయాన్ని వృధా చేశారు. రేవంత్ రెడ్డి మీ కపట నాటకాలతో ఇన్నాళ్లు బీసీ లను మోసం చేసినందుకు మా బీసీ ఆగ్రహనికి గురికాక తప్పదు. అన్ని వారు హెచ్చరిక చేశారు.

# బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు

సత్యమేవ జయతే కొండాపూర్ మండల కేంద్రానికి చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకులు షాబుద్దీన్ మైబలి గారి ఆధ్వర్యంలో 30 మంది బీఆర్ఎస్ పార్టీ కి చెందిక కార్యకర్తలు సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి గారి సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది ఈ సందర్భంగా మైభలి మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్,ఎంపీటీసీ అభ్యర్థులను మరియు జడ్పిటిసి స్థానం ను గెలుస్తామని ధీమా వ్యక్తం చేసారు. కార్యక్రమంలో కారా మోహిన్, సారా శోకత్ అలీ,నైకోటి అబ్దుల్, నైకోటి ఖాజామియా,మాజీ ఎంపీటీసీ నరసింహా రెడ్డి, ప్రభుదాస్, శివ, ఆత్మకమిటీ ఛైర్మెన్ ప్రభు, నైకోటి మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# కుమ్రం భీం పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

## సత్యమేవ జయతే - కుమరం భీం ఆసిఫాబాద్



సత్యమేవ జయతే - కుమరం భీం ఆసిఫాబాద్
కుమరం భీం ఆసిఫాబాద్ : ఆదివాసీ హక్కులకై నైజాం సర్కారుతో పోరాడిన యోధుడు కుమ్రం భీంను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు ఆడ శ్రీరామ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుండాల గ్రామంలో కుమ్రం భీం 85వ వర్ధంతిని నిర్వహించారు. కుమ్రం భీం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెండాను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందు కెళ్లాలన్నారు. ఆదివాసులు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తీరం మాల్కుపటేల్, ఆత్రం భీం రావు, కుమ్రం భీం రావు, మెస్రం ఆనంద్ రావు,సలాం రాజు, కోట్నాక్ లచ్చు, సలాం చంపత్ రావు, మడావి జంగు, హన్మంతరావు తదితరులున్నారు.

# ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్ కుమార్ దీపక్

సత్యమేవ జయతే - మంచిర్యాల
మంచిర్యాల : మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ స్వీకరణకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు, అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు, ఫర్నిచర్, భద్రతా చర్యలను తనిఖీ చేశారు.
అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో సాగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. నామినేషన్ కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్



కూడా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సహాయ అధికారులు ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ జ్యోత్స్న, మండల ప్రత్యేక అధికారి, జడ్పీటీసీ ఆర్వో కటకం అంజయ్య, ఎంపీటీసీ ఆర్వోలు సుష్మ, మల్లేశం శ్రీనివాస్, ఎంపీవో అనిల్ కుమార్, తాండూర్, మాదారం ఎస్సై లు కిరణ్ కుమార్, సౌజన్య, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనంతా అయోమయం.. రేవంత్ సర్కార్‌పై ఆర్ఎస్పీ ఫైర్



సత్యమేవ జయతే - సిర్పూర్
సిర్పూర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనంతా అయోమయంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజవకర్గంలో గందరగోళం నెలకొంది అని ఆయన ధ్వజమెత్తారు. ఇందుకు సిర్పూర్ తాలుకా సార్సాల గ్రామంలోని పరిస్థితే నిదర్శనమని ఆర్ఎస్పీ చెప్పుకొచ్చారు.
సిర్పూర్ తాలూకా సార్సాలలో జుమిడి మీనా, రత్నం సౌజన్య, గుబుడే అనూష, గుబడే శేఖర్ అనే నలుగురు వ్యక్తులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయి. వీల్లు ఇల్లు కట్టుకోడానికి ముగ్గు పోద్దామని వెళ్తే, అటవీ అధికారులు వచ్చి అడ్డుకుంటున్నారు. ఇది అటవీ భూమి ఇల్లు కట్టుకోడానికి అవకాశం లేదంటున్నారు. ఈ వ్యక్తులేమో గత 50 ఏళ్ల నుండి ఇక్కడే నివసిస్తున్నారు.. ఇల్లు పన్ను, కరెంట్ బిల్లు కడుతున్నారు. ఉన్న ఇంటి స్థలంలోనే కొత్తగా ముగ్గు పోద్దామంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.
గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ కమిటీలు వేసి వీల్లను లబ్దిదారులుగా గుర్తించి ఇండ్లు ఇస్తారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖనేమో లేదు లేదు అది అటవీ ప్రాంతం అక్కడ ఇల్లు కట్టద్దు అంటరు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేమో ఆయన ఫోటోతో సహా ఇల్లు కట్టుకోండి అని లెటర్లు పంపిస్తరు. పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్కనేమో ప్రజల నుండి ఇంటి పన్ను వసూలు చేస్తరు అని ఆర్ఎస్పీ గుర్తు చేశారు. మరి ఇపుడు ఆ కుటుంబాలు ఏం చేయాలి.? ఉన్న ఇండ్లు ఖాళీ చేసి కొత్త ఇండ్లకు ముగ్గు పోద్దామంటే ఉన్న ఇల్లు పోయింది. ఇపుడు ఎటు పోవాలి,ఎక్కడ నివసించాలి? దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? జిల్లా కలెక్టర్ నీ చేతుల్లో ఏం లేదు అంటరు , జిల్లా అటవీ అధికారి ఇది మా చట్టం అంటరు. మరి పేద ప్రజలకు హక్కులు చట్టాలు లేవా? కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరిని మోసం చేయాలని చూస్తుంది.? రేవంత్ రెడ్డి గారు ఇదేనా ప్రజాపాలన? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.

## గ్రూప్-2లో ఉద్యోగం సాధించిన సునీల్ ఘన సన్మానం



సత్యమేవ జయతే - కరీంనగర్ కరీంనగర్ : మల్లాపూర్ మండలంలోని సాతారం గ్రామానికి చెందిన బడే సునీల్ ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మాల మహర్ సేన సంఘం మండలాధ్యక్షుడు పులేరి రాము ఆధ్వర్యంలో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, రాజేందర్, దేవయ్య, ముత్యం, గోపి, బాలు, రాజేష్, భూమయ్య, రవి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో 'జెర్రి' ప్రత్యక్షం.. ఆందోళనలో విద్యార్థులు



సత్యమేవ జయతే - మహబూబ్‌నగర్ మహబూబ్‌నగర్ : తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలు నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల భవిష్యత్‌ను ఈ రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా, పురుగుల అన్నం పెడుతూ వారి జీవితాలతో ఆటలాడుకుంటుంది రేవంత్ రెడ్డి సర్కార్. ఇందుకు తాజాగా చోటు చేసుకున్న ఈ ఘటనే నిదర్శనం.
మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బాదేపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఇవాళ మధ్యాహ్న భోజనంలో ఓ జెర్రి ప్రత్యక్షమైంది. దీంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురై భోజనం తినకుండా పడేశారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లగా వారు కూడా సీరియస్‌గా తీసుకోలేదు. ఇలా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు.
ప్రతి రోజు మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థులు. ఈ పురుగుల అన్నం తినలేకపోతున్నామని పలువురు విద్యార్థులు కన్నీరు పెట్టుకున్నారు.

## గర్భిణిలు అంగన్‌వాడీలో వివరాలను నమోదు చేయించుకోవాలి : విజయలక్ష్మి




సత్యమేవ జయతే - షాద్‌నగర్‌షాద్‌నగర్ : ప్రతి గర్భిణి అంగన్‌వాడీలో తమ వివరాలను తప్పకుండా నమోదు చేయించుకోవాలని షాద్‌నగర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. పోషణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లి, చించోడ్ గ్రామంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో పాటు రక్తహీనతకు గురికాకుండా ఆకుకూరలతో కూడిన ఆహారాన్ని ప్రతి రోజూ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు సమయానికి ఆహారం తీసుకుంటే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పౌష్టికాహారంతో కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సులో పొగలు.. 25 మంది విద్యార్థులు సురక్షితం



సత్యమేవ జయతే - సికింద్రాబాద్ సికింద్రాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ఘోర ప్రమాదం తప్పింది. స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రయివేటు పాఠశాల బస్సులో ఆకస్మికంగా పొగలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపి ఉంచాడు. అనంతరం పిల్లలందరిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.
అటుగా వెళ్తున్న వాహనదారులు కూడా బస్సు డ్రైవర్‌కు సహాయం అందించారు. పిల్లలను బస్సులో నుంచి బయటకు తీసుకొచ్చారు. పిల్లలకు ఎలాంటి హానీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.
ఈ సందర్భంగా తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. స్కూల్ బస్సు ఇంజిన్‌లో నుంచి పొగలు వచ్చినప్పుడు.. బస్సులో 25 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. పిల్లలందరూ సురక్షితంగా బయటపడ్డారని, ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదన్నారు. డ్రైవర్ కూడా ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. పిల్లలను మరో బస్సులో పాఠశాలకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# ఎస్సీ హాస్టల్ నుండి ముగ్గురు విద్యార్థినుల మిస్సింగ్

**- తెల్లవారుజామున వెళ్లిపోయినట్లు గుర్తించిన హాస్టల్ సిబ్బంది**

**- వార్డెన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు**




సత్యమేవ జయతే - నిజామాబాద్ నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల వసతి గృహం నుండి ముగ్గురు విద్యార్థినిలు వెళ్లిపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. నగరంలోని కోట గల్లి ఎస్సీ హాస్టల్లో వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన రెండో టౌన్ ఎస్ఐ ముజాహిద్ వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రాంగణంలో గల ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహంలో ఉండే ముగ్గురు విద్యార్థినిలు ఈరోజు తెల్లవారుజాము ఎవరికి చెప్పకుండా హాస్టల్ నుండి బయటకు వెళ్లిపోయినట్లు హాస్టల్ సిబ్బంది గుర్తించినట్లు తెలిపారు.
విద్యార్థుల కోసం చుట్టుపక్కల వెతికినప్పటికీ ఇలాంటి ఆచూకీ లభించకపోవడంతో సదరు హాస్టల్ వార్డెన్ నాగలక్ష్మి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.
తెల్లవారుజాము నుండి హాస్టల్ పరిసర ప్రాంతాలతో పాటు బస్టాండ్, రైల్వే స్టేషన్ ఇతర ప్రధాన కూడలలో కల సీసీ కెమెరాల ఫుటేజ్ లను పోలీస్ బృందాలు పరిశీలిస్తున్నారు. హాస్టల్ నుండి విద్యార్థినిలు అదృశ్యమైన విషయం వాళ్ల తల్లిదండ్రులకు తెలియడంతో వాళ్లు ఆందోళనకు గురై హుటా హుటిన హాస్టల్కు వచ్చినట్లు తెలిసింది. హాస్టల్ నుండి వెళ్లిపోయిన ముగ్గురు విద్యార్థినిలు హాస్టల్లో ఉండడం ఇష్టం లేక వెళ్లిపోయారా, లేక ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో సైతం పోలీసులు విచారణ చేపట్టారు.

# అవసరానికి వాడుకుని ఆ తర్వాత చంపేశాడు

**- వెంకటేశ్వర్లు హత్య కేసులో నిందితుల అరెస్ట్**

**- కేసు వివరాలు వెల్లడించిన ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి**




సత్యమేవ జయతే - ఖమ్మం ఖమ్మం : ఖమ్మం జిల్లా కేంద్రంలో గల నెలలో జరిగిన హత్య కేసును పోలీసులు విజయవంతంగా చేధించారు. కేసు వివరాలను గురువారం ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఇతర అధికారులతో కలిసి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పరిమి అశోక్ కొంతకాలంగా ఖమ్మం జిల్లాలో నివాసం ఉంటున్నాడు. ఖమ్మం అర్బన్ మండలం పల్లెలో వంగతోట సాగు చేసేవాడు. సాగులో నష్టాలు రావడం, అప్పులపాలు కావడంతో ప్రత్యామ్నాయ వ్యాపారం చేసేందుకు ఖమ్మం వచ్చాడు. ఈ క్రమంలో ఖమ్మం నగర కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయా గా పనిచేసే కొమ్ము నగ్మాతో అశోక్‌కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త శారీరక సంబంధానికి దారితీసింది.
ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన గట్ల వెంకటేశ్వర్లు గ్రంథాలయం వద్ద అశోక్‌కు పరిచయం అయ్యాడు. కాలక్రమంలో వీరి పరిచయం స్వలింగ సంపర్కానికి దారితీసింది. అశోక్ రూమ్ కు వెంకటేశ్వర్లు తరచూ వచ్చిపోతుండేవాడు. వచ్చిన ప్రతిసారి అశోక్ కు ఆర్థిక సహకారం చేసేవాడు. అయితే ఏక మొత్తంలో ఒకేసారి వెంకటేశ్వర్లును చంపి అతడి వద్ద ఉన్న బంగారం, ఇతర ఆస్తులను చేజిక్కించుకోవాలనే దురుద్దేశ్యంతో అశోక్ కుట్రకు తెరలేపాడు. ఈ క్రమంలో బాలపేటలో తాను వ్యవసాయం చేస్తున్న సమయంలో పరిచయమైన పెంటి కృష్ణయ్య సహకారం తీసుకున్నాడు. వెంకటేశ్వర్లును ఎలా చంపాలి, చంపిన తర్వాత శరీర భాగాలను గుర్తు తెలియని ప్రదేశాల్లో ఎలా వేయాలి అనే అంశాలను యూట్యూబ్‌లో సెర్చ్ చేశాడు. గత నెల 15వ తేదీన వెంకటేశ్వర్లు యాథావిధిగా అశోక్ రూమ్‌కు వచ్చి పడుకున్నాడు. నిద్రలో ఉన్న వెంకటేశ్వర్లును తెల్లవారుజామున అతి కిరాతంగా అశోక్ నరికి చంపాడు. మెడపై పలుమార్లు నరికి తల మొండెం వేరు చేశాడు. ఆ సమయంలో నగ్మాను రూమ్ బయట కాపలాగా ఉంచాడు.
శరీరాన్ని ముక్కలుగా నరికిన తర్వాత ఆ భాగాలను ప్లాస్టిక్ కవర్లలో కట్టి కరోనావ్ గిరి ప్రాంతంలో పొదలు, చెత్తలో విసిరేశాడు. ఆ తర్వాత గదిలోని రక్తపు మరకలను శుభ్రపరిచినట్లు విచారణలో తేలిందని ఏసీపీ తెలిపారు. నిందితులు ఏ-1 పరిమి అశోక్, ఏ-2 కొమ్ము నగ్మా, ఏ-3 పెంటి కృష్ణపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నుండి రెండు తులాల గోల్డ్ చైన్, సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, బి.సాయికుమార్, కారేపల్లి ఎస్ఐ గోపి, కానిస్టేబుల్ సంపత్కారేపల్లి ఎస్ఐ గోపి, కానిస్టేబుల్ సంపత్, ఆనంద్, అంజి, రాజేశ్, ఉపేందర్, సైదాను ఏసీపీ అభినందించారు.

# దేశ సేవలో ముందుండాలి...!





**- సామాజిక సమరసత రాష్ట్ర కన్వీ నర్ అప్పల ప్రసాద్**

**- ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు**

సత్యమేవ జయతే జహీరాబాద్/ ప్రతినిధి అక్టోబర్ 9

భారతదేశంలో పుట్టడం మన అదృష్టంగా భావించి ప్రతి ఒక్కరూ మాతృ భూమిని ప్రేమించాలని సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. ఝరాసంగం మండలం బర్దిపూర్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ శతాబ్ది ఉత్సవాల భాగంగా గ్రామంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారతమాత, డాక్టర్ హేడ్గేవార్, గురుజీ చిత్రపటాలతో పాటు కాషాయ ధ్వజం చేత పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ం ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందని అన్నారు. స్వామి వివేకానంద, బాల గంగాధర్ తిలక్, సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. హిందూ సమాజంలో సౌశీల్యాన్ని పెంపొందించి జాతి నిర్మాణంలో భాగస్వామ్యం కల్పించడం హేడ్గేవార్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో లక్షకు పైగా శాఖలు నిర్వహిస్తూ, తన భావజాలాన్ని దేశ వ్యాప్తంగా విస్తరింపజేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. గ్రామంలో నిర్వహించిన ర్యాలీ పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి మహారాజ్, భక్తులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రూ. 10 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రతి రోజు నగరం నలుమూలల ఎక్కడో ఒక చోట డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా రూ. 10 కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎఫిడ్రిన్ అనే డ్రగ్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.
వివరాల్లోకి వెళ్తే.. జీడిమెట్ల పరిధిలోని సుచిత్రా క్రాస్ రోడ్స్ సమీపంలోని స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో సాయిదత్తా రెసిడెన్సీలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు ఈగల్ టీమ్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఈగల్ టీమ్ అక్కడ దాడులు నిర్వహించి.. 220 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. పట్టుబడ్డ డ్రగ్ విలువ రూ. 10 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. అదే అంతర్జాతీయ మార్కెట్‌లో అయితే రూ. 70 కోట్లు విలువ చేస్తుందన్నారు.
ఈ డ్రగ్స్ దందాకు సంబంధించి నలుగురిని అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో వాస్తవాయి శివరామకృష్ణ వర్మ, దంగేటి అనిల్, మద్దు వెంకటకృష్ణ, ఎం ప్రసాద్, ముసిని దొరబాబు ఉన్నారు. వీరంతా ఏపీలోని కాకినాడ, తూర్పు గోదావరి, నెల్లూరు జిల్లాలకు చెందిన వారని పోలీసులు తేల్చారు.

## నవాబుపేట్ లో ఎంపీటీసీ జెడ్పిటిసి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్ జైన్



సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబ్‌పేట్, అక్టోబర్ 9: వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం నవాబ్‌పేట్ మండలంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు.ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, నామినేషన్ల స్వీకరణ విధానం, రికార్డు నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ –"నామినేషన్ల స్వీకరణ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరగాలి. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి" అని సూచించారు.కేంద్రంలో ఏర్పాటు చేసిన సహాయక డెస్కులు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, సీసీ కెమెరా పర్యవేక్షణ వంటి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, అధికారులు సమయపాలన పాటించాలని కలెక్టర్ సూచించారు.

## 'కొన్ని రాజకీయ పార్టీలు తప్పుడు కథనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి'- ఈసీ కీలక వ్యాఖ్యలు

**ఎస్ఐఆర్ అంశంపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగిన నేపథ్యంలో ఈసీ వ్యాఖ్యలు- కొన్ని పార్టీలు ఎస్ఐఆర్‌కు సహకరించడం లేదని ఆగ్రహం!**

బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అంశంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కీలక వ్యాఖ్యలు చేసింది. కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు ఈసీ ప్రయత్నాలకు సహకరించకుండా తప్పుడు కథనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని పేర్కొంది. ఎస్ఐఆర్ అంశంపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగిన నేపథ్యంలో ఈసీ ఈ మేర వ్యాఖ్యానించింది.

తొలగించిన 3.36 లక్షల ఓటర్ల వివరాలను అందజేయాలి: సుప్రీం

బిహార్‌లో ఎస్ఐఆర్‌పై అత్యున్నత న్యాయస్థానంలో దాఖలైన పలు పిటిషన్లపై గురువారం వాదనలు కొనసాగాయి. అంతకుముందు ప్రతిపాదిత జాబితాలో పేరు ఉండి, తుది జాబితాలో తొలగించిన 3.36 లక్షల ఓటర్ల వివరాలను అందజేయాలని సుప్రీం కోర్టు పేర్కొంది. వీటిని పరిశీలించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీల ధర్మాసనం ఈ అంశం గందరగోళంగా ఉందని తెలిపింది. వీరికి అప్పీలు చేసుకునే అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం పారా లీగల్ వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని బిహార్ లీగల్ సర్వీసెస్ ఛైర్‌పర్సన్‌కు ఆదేశాలు జారీ చేసింది.

పది శాతం ఓటర్లు తమ హక్కును కోల్పోయారు!

ఈ సందర్భంగా సుప్రీం కోర్టులో ఎస్ఐఆర్‌పై పలువురు పిటిషనర్లు వాదనలు వినిపించారు. దాదాపు పది శాతం ఓటర్లు తమ హక్కును కోల్పోయారని సామాజిక వేత్త యోగేంద్ర యాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు చేరగా వారి నుంచి నిర్దేశిత ధ్రువీకరణ పత్రాల్లో ఒక్కటి కూడా తీసుకోలేదని ఆరోపించారు. వీటికితోడు లక్షలాది మహిళా ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని, లక్షల కుటుంబాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు.పిటిషనర్ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారని తెలిపింది. బిహార్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటారని, ఇప్పటికైనా మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. అధికారులకు వాళ్లు ఏం చేస్తున్నారో అనే విషయం తెలుసునని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను అక్టోబర్ 16కు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది.

## రూ. 2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తహసీల్దార్



సత్యమేవ జయతే – నల్గొండ
నల్గొండ : నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహసీల్దార్ కృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గుండ్రంపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ భూమికి సంబంధించన మ్యూటేషన్ కోసం రూ.2లక్షలు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.
తహసీల్ కార్యాలయంలో వ్యూహం ప్రకారం మాటువేసిన ఏసీబీ అధికారులు గురువారం తహసీల్దార్ గుగులోత్ కృష్ణా , మరో ప్రైవేట్ వ్యక్తి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నాంబర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ సిబ్బంది లంచాలకు పాల్పడితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## వికారాబాద్‌లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందడి ప్రారంభం







సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబ్‌పేట్, అక్టోబర్ 9: వికారాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి మొదలైంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గురువారం అధికారికంగా ప్రారంభమైంది. ఎన్నికల అధికారులు అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.
నవాబ్‌పేట్ మండల కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సుధీర్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించి, అధికారుల పనితీరును సమీక్షించారు.
రిటర్నింగ్ అధికారులతో మాట్లాడిన ఆయన – "నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా, సమయపాలనతో సాగాలి. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి" అని సూచించారు.
రికార్డు నిర్వహణలో జాగ్రత్త వహించాలని, సహాయక డెస్కుల ద్వారా అభ్యర్థులకు మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు.
జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై వివరాలు వెల్లడించిన అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ – "జిల్లాలోని 11 మండలాల్లో మొత్తం 115 ఎంపీటీసీ స్థానాలకు, ప్రతి మండల కేంద్రంలో ఒక జెడ్పీటీసీ స్థానానికి నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 9 నుండి 11 వరకు కొనసాగుతుంది" అన్నారు.
ప్రతి మండల కేంద్రంలో జెడ్పీటీసీకి ఒక రిటర్నింగ్ అధికారి (%=ా%), ఎంపీటీసీ స్థానాలకు పలువురు ఆర్‌ఓలను నియమించినట్లు తెలిపారు.
అభ్యర్థులు తమ విద్యార్హతలు, ఆర్థిక వివరాలకు సంబంధించిన స్వీయ ధృవీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. పార్టీ తరఫున పోటీ చేసేవారు తప్పనిసరిగా పార్టీ అధిష్టానం జారీ చేసిన 'బీ ఫారం' సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు.
బీ ఫారం లేని వారు స్వతంత్ర అభ్యర్థులుగా పరిగణించబడతారని తెలిపారు.
అలాగే, నేర చరిత్ర గల వారు లేదా గత ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వని వారు అనర్హులుగా పరిగణించబడతారని హెచ్చరించారు. ప్రతి రోజు నామినేషన్ల వివరాలు సాయంత్రం 5 గంటలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.
జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, అభ్యర్థులు మరియు పార్టీ ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని ఎన్నికల అధికారులు కోరారు.

## పరీక్షల్లో ఎక్కువ మార్కులు వస్తే విమానంలో ఉచిత ప్రయాణం- ఎక్కడో తెలుసా?

2013లో ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు– 13 సంవత్సరాల్లో సుమారు 50 మంది విద్యార్థులు విమానంలో ప్రయాణం– పరీక్షల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి విదేశీ పర్యటనలు
విద్యను ప్రోత్సహించేందుకు ఛత్తీస్‌గఢ్ ఉత్తర బస్తర్‌లోని ఓ గ్రామం వినూత్నమైన కార్యక్రమాన్ని చేపట్టింది. బోర్డు పరీక్షల్లో 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించే విద్యార్థులకు విమాన ప్రయాణం అవకాశాన్ని కల్పిస్తుంది. అలాగే పరీక్షల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి విదేశీ పర్యటనలు అందిస్తోంది. విద్యార్థుల విమాన ప్రయాణ ఖర్చు మొత్తాన్ని గ్రామ అధికారులతో పాటు ఉద్యోగులు కలిసి భరిస్తారు. ప్రతి సంవత్సరం పది లేదా 12వ తరగతి బోర్డు పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేస్తారు.
విద్యార్థుల్లో విద్యను ప్రోత్సహించేందుకు వినూత్న ప్రయత్నం
ముసుర్‌పుట్ట గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డి.కె. భాస్కర్ 2013లో ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. పిల్లలకు చదువుపై ఆసక్తిని పెంచేందుకే దీన్ని ప్రారంభించినట్లు భాస్కర్ తెలిపారు. మారుమూల ప్రాంతంలోని పిల్లలు ఎప్పుడూ రైలు, విమానాలను ప్రయాణాలు చేయలేదని, వారికి ఇదొక సువర్ణావకాశమని తెలిపారు. ఈ సందర్భంగా గడిచిన 13 సంవత్సరాల్లో సుమారు 50 మంది విద్యార్థులు విమానంలో ప్రయాణం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సానుకూల ప్రభావాన్ని చూపిందన్నారు.
ి పరీక్షల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి విదేశీ పర్యటనలు
%గతంలో విద్యార్థులు 60 నుంచి 70 శాతం మధ్య మార్కులు సాధించేవారన్న ఆయన, ఇప్పుడు 90





శాతానికి పైగా మార్కులు సాధిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా భారతదేశంలోని వివిధ పర్యాటక ప్రదేశాలైన దిల్లీ, కోల్‌కతా, పూరీ, ముంబయి, ద్వారకా, జమ్మూ– కశ్మీర్, నేపాల్‌ను సందర్శించే అవకాశం విద్యార్థులకు కల్పించామని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ మెరిట్ జాబితాలో స్థానం సాధించిన విద్యార్థులకు సింగపూర్ పర్యటన ఉంటుందని భాస్కర్ అన్నారు. ఈ చొరవతో పిల్లల్లో విద్యపట్ల మక్కువ కల్గించడమే వారి ఉద్దేశమని తెలిపారు.
%2013లో ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ సెల్‌లో దాదాపు 50 మంది సభ్యులు ఉండేవారని, ప్రస్తుతం 100 మంది సభ్యులు ఉన్నారని భాస్కర్ పేర్కొన్నారు. వారంతా ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. కాగా ఈ కార్యక్రమాన్ని మొదట గ్రామంలోని ఇద్దరు అధికారులు, ఉద్యోగులు ప్రారంభించారు. వీరు 2008 నుంచి 2013 వరకు గ్రామంలో మంచి స్కోరు సాధించిన పిల్లలను దీపావళి రోజున సత్కరించడం ప్రారంభించారు. వారికి బహుమతులుగా సైకిళ్లు, పుస్తకాలు అందజేశేవారు. కానీ, 2013 నుంచి ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ సెల్ ఈ విమాన ప్రయాణాన్ని ప్రకటించింది.
మరోవైపు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2025 అక్టోబర్‌లో 10వ తరగతి బోర్డు పరీక్షలో 90 శాతం మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు విమానంలో ప్రయాణించే అవకాశం కల్పించారు. డేవిడ్ సాహు, తోషన్ కుమార్ సాహు అనే ఇద్దరు విద్యార్థులను రాయ్‌పుర్ నుంచి ఒడిశాకు విమానంలో ప్రయాణించారు. ఈ ప్రయాణంతో తాము చాలా సంతోషంగా ఉన్నామని, కొత్త ప్రదేశాలను చూడడం వల్ల తాము చాలా నేర్చుకున్నామని పేర్కొన్నారు. రైలు, విమాన ప్రయాణాలు ఎన్నడూ చేయలేదని ఆనందం వ్యక్తం చేశారు. అదే విధంగా 12వ తరగతిలో కూడా మంచి మార్కులు సాధించి మళ్లీ ప్రయాణించే అవకాశం పొందుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మిసిమి జడకు పసిమి తళుకు



మిసిమి జడకు పసిమి తళుకు ముచ్చటైన చీరకు చూడచక్కని వాలుజడ తోడైతే ఆ అందం గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే అవుతుంది. సిగ అల్లికల అలంకారం కోసం నాగరం నుంచి జడకుప్పెల దాకా ఎన్నెన్నో నగలు మేమంటే మేమని పోటీ పడుతుంటాయి. ముచ్చటైన చీరకు చూడచక్కని వాలుజడ తోడైతే ఆ అందం గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే అవుతుంది. సిగ అల్లికల అలంకారం కోసం నాగరం నుంచి జడకుప్పెల దాకా ఎన్నెన్నో నగలు మేమంటే మేమని పోటీ పడుతుంటాయి. ఇక్కడ కండ్లను కట్టిపడేసేలా కనిపిస్తున్నది కిషన్‌దాస్ జువెలరీ సంస్థ రూపొందించిన మేలిమి బంగారు జడ.

బర్మీస్ రూబీ, పోల్కీలను జతచేసిన ఈ జడకు చివర జడకుచ్చులు అందంగా వేలాడేలా రూపొందించారు. మీనం ఆకృతిలో వచ్చే డిజైన్ దీనికి ప్రత్యేక ఆకర్షణ. దానిపైన పచ్చలు, కెంపులు, పోల్కీలు పొదిగి చేసిన జడబిళ్లకు రెండు వైపులా ముత్యాలసరాలు ముగ్ధంగా అమరిపోయాయి. ఎంబ్రాయిడరీ చేసిన ఆఫ్‌వైట్ రంగు చీర రితికా మీర్‌చందానీ కలెక్షన్‌లోనిది.

# వేణుగానం జయప్రదం



వేణుగానం జయప్రదం రేపల్లెను మురిపించిన మురళి, గోపికలను బులిపించిన రవళి.. జయప్రదా రామమూర్తిని కూడా వేణుగాన విద్వాంసురాలిని చేసింది. తొలి మహిళా ఫ్లూటిస్ట్‌గా రికార్డులకు ఎక్కించింది. వేణువుతో జయప్రద స్నేహం ఓ రేణువులానే మొదలైంది.. రేపల్లెను మురిపించిన మురళి, గోపికలను బులిపించిన రవళి.. జయప్రదా రామమూర్తిని కూడా వేణుగాన విద్వాంసురాలిని చేసింది. తొలి మహిళా ఫ్లూటిస్ట్‌గా రికార్డులకు ఎక్కించింది. వేణువుతో జయప్రద స్నేహం ఓ రేణువులానే మొదలైంది..ఇంటి పనుల్లో తలమునకలైన ఆ గృహిణికి ఇంపైన వేణుగానం వినిపించింది. తను కూడా గాయని కావడంతో ఆ వాద్య సంగీతాన్ని మనసారా ఆస్వాదించింది. 'ఎవరిదో ఈ మురళీ గానం..' అనుకుంటూ తలతిప్పి చూసింది. తన కళ్లను తానే నమ్మలేకపోయింది. ఎదురుగా కూతురు.. జయప్రద. చేతిలో వేణువు. స్వరానికి తగ్గట్టు పిల్లనగ్రోవిని పలకరిస్తున్న ప్రాణవాయువు. అప్పటికి జయ వయసు పన్నెండు. జయప్రదా రామమూర్తి కుటుంబీకులు కర్ణాటకలోని బళ్లారి ప్రాంతానికి చెందినవారు. తాతల కాలంలోనే హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తండ్రి వెంకటరమణ రామమూర్తి భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో సైంటిస్ట్. తల్లి ప్రేమా రామమూర్తి సంగీత విద్వాంసురాలు. ఇంట్లో కర్ణాటక సంగీతం మారుమోగేది. తండ్రి శాస్త్రవేత్త కావడంతో అనేకానేక విషయాల మీద లోతైన చర్చలు జరిగేవి. కాబట్టే, 'ఫ్లూటిస్ట్ కాకపోయి ఉంటే కచ్చితంగా ఐఏఎస్ అధికారిని అయ్యేదాన్ని' అంటారు జయప్రద. వేణుగానం మీద మక్కువతో, పాకెట్ మనీలో నుంచి రూ.60 ఖర్చుపెట్టి ఫ్లూట్ కొనుక్కున్నారు జయప్రద. తొలిరోజుల్లో సొంతంగానే సాధన చేసినా.. ఆ తర్వాత నటేషన్ రమణి దగ్గర శిష్యరికం చేశారు. హరిప్రసాద్ చౌరాసియా సమక్షంలో కొంతకాలం సాధన చేశారు.

**సంగీతమా? చదువా?**

ప్రతి మనిషి జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయి. గడ్డుకాలం వచ్చి తీరుతుంది. జయప్రద కూడా అలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు. తండ్రి అకాల మరణం ఆ కుటుంబంలో ఓ పెద్ద కుదుపు. చదువు, వేణుగానం.. ఏదో ఒకటి ఎంచుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఐఏఎస్ ఆలోచనకు స్వస్తి పలికారు. సంగీతాన్ని కెరీర్‌గా ఎంచుకున్నారు. 'ఏదైనా సాధించాలనుకుంటే మనసులో గట్టిగా సంకల్పించుకుంటే సరిపోతుంది' అనే మాట జయప్రద విషయంలో నిజమైంది. గొప్ప ఫ్లూటిస్ట్‌గా పేరు తెచ్చుకోవాలనేది ఆమె లక్ష్యం. అందుకు అనుక్షణం శ్రమించారు. కఠోర సాధన చేశారు. వందలాది ప్రదర్శనలిచ్చారు. అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ ఓసారి టెలివిజన్‌లో జయప్రద వేణుగానాన్ని తిలకించారు, ఆలకించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ద్వారా జయప్రదను రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానించారు. కచేరీ పెట్టించారు. 'ఎప్పటికైనా నువ్వు గొప్ప వేణుగాన విద్వాంసురాలివి అవుతావు' అంటూ ప్రశంసించారు.

**సినిమాల్లోకి..** దర్శకేంద్రుడు కె.రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన 'ఓం నమో వేంకటేశాయ' సినిమా ద్వారా జయప్రద వెండి తెర ఫ్లూటిస్ట్‌గా పరిచయం అయ్యారు. ఆ తర్వాత మరిన్ని అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. 'బాహుబలి-2', 'వకీల్‌సాబ్' వంటి పెద్ద సినిమాలకూ పనిచేశారు. త్వరలోనే, సంగీత దర్శకుడు కోటి నేతృత్వంలో ఓ ప్రాజెక్టు కోసం పని చేయనున్నారు. తన వేణుగాన ప్రస్థానంలో జయప్రద ఎన్నో రికార్డులు సాధించారు. ఆమె ఇరవై రకాల ఫ్లూట్స్ వాయించగలరు. స్వరాల నాణ్యత వేణువు పైనే ఆధార పడుతుంది. కాబట్టే అస్సాం, బొంబై, చెన్నై, బెంగళూరు నుంచి వేణువులు తెప్పించుకుంటారు. అన్నమయ్య లక్ష గళార్చన కార్యక్రమానికి గానూ.. ప్రపంచ రికార్డు నమోదు చేశారు. భారత సాంస్కృతి క శాఖ నుంచి నేషనల్ ఫెలోషిప్ కూడా అందుకున్నారు. కంచి పీఠం, శ్రీశైలం, గురువాయూర్, యాదాద్రి, వేములవాడ తదితర ఆధ్యాత్మిక క్షేత్రాలకు ఆస్థాన విద్వాంసురాలుగానూ ఉన్నారు జయప్రద.

**ప్రపంచ దేశాల్లో..** చదువుకునే రోజుల్లో ప్రపంచ పటంలో వివిధ దేశాల పేర్లు చూసి 'భూమి మీద ఇన్ని దేశాలున్నాయా? వీలైతే అన్నీ చుట్టేయాలి' అనుకునేవారు జయప్రద. ఆ కోరిక ఇప్పుడు నెరవేరింది. రష్యా, చైనా, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ప్రదర్శనలిచ్చారు. వేల కచేరీలు చేసినా.. ప్రతి కచేరీని తొలి ప్రదర్శనగానే భావిస్తారు. అంతే శ్రద్ధగా శ్రోతల్ని అలరిస్తారు. కొన్నివేల కరతాళ ధ్వనులు ఆమె వేణుగాన ప్రతిభకు సాక్ష్యాలుగా నిలిచాయి. తన దగ్గరికి వచ్చేవారికి ఆమె చెప్పే మాట ఒకటే.. 'వేణుగానాన్ని నేర్చుకోవాలనుకుంటే, ముందుగా ఆ కళను ప్రేమించడం మొదలుపెట్టండి. ఉపాధిలా కాకుండా ఒక ఉద్యమంలా స్వీకరించండి. సాధన చేస్తూనే ఉండండి'.

# రాతి యుగం నగలు నయా ట్రెండ్



రాతి యుగం నగలు నయా ట్రెండ్ నగల్లో రాళ్లు పొదగడం తెలిసిందే. కానీ, ముందే ఓ పెద్దరాయి తీసుకుని.. దాని ఆధారంగా ఆభరణాన్ని డిజైన్ చేయడం నయా ట్రెండ్. ఇందులో పెండెంట్లు, ఉంగరాలు, దుద్దులు.. ఇలా నగలన్నీ పెద్ద పెద్ద రాళ్లచుట్టే తిరుగుతాయి. 'బిగ్‌స్టోన్ జువెలరీ' అమ్మాయిల మనసులో పెద్ద చోటే సంపాదిస్తున్నాయి

నగల్లో రాళ్లు పొదగడం తెలిసిందే. కానీ, ముందే ఓ పెద్దరాయి తీసుకుని.. దాని ఆధారంగా ఆభరణాన్ని డిజైన్ చేయడం నయా ట్రెండ్. ఇందులో పెండెంట్లు, ఉంగరాలు, దుద్దులు.. ఇలా నగలన్నీ పెద్ద పెద్ద రాళ్లచుట్టే తిరుగుతాయి. 'బిగ్‌స్టోన్ జువెలరీ' అమ్మాయిల మనసులో పెద్ద చోటే సంపాదిస్తున్నాయి. నయా ఫ్యాషన్ అన్న పదం నగలకు కుదిరినంతగా మరి దేనికీ సరిపోదేమో. ఖరీదైన బంగారు ఆభరణాలైనా, పాకెట్ ఫ్రెండ్లీ ఫ్యాన్సీ నగలైనా.. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూనే ఉంటాయి. కొత్తకొత్త డిజైన్లతో కొంగొత్త రూపాల్లో దర్శనమిస్తూనే ఉంటాయి.

చూడగానే జిగేల్‌మనిపించే రాళ్ల నగలుకూడా ఇప్పుడు నయా లుక్‌లో కనిపిస్తున్నాయి. నగను డిజైన్ చేశాక రాళ్లు కూర్చడం కాదు, రాయిని ఎంచుకున్నాకే నగను డిజైన్ చేస్తారిక్కడ. బంగారం విషయమే తీసుకుంటే పచ్చ, కెంపు, ట్యాంజనైట్‌లాంటి విలువైన రాళ్లను ఉపయోగిస్తున్నారు. వాటి మీద స్వర్ణాన్ని అల్లికలా రూపొందించి, చిన్నచిన్న వజ్రాలు, అమెరికన్ డైమండ్లను పొదుగుతున్నారు. ఈ తరహా ఉంగరాలు రాణీవారి అంగులీకంలా చూడగానే ఆకట్టుకుంటాయి.

దాని మీద బంగారు తాపడంతో కళ్లను కట్టిపడేసేలా అలంకరించడం డిజైనర్ల పని. ఇదే తరహాలో కాలేజీ అమ్మాయిల కోసం ఏడీ స్టోన్, రైన్ స్టోన్, కలర్డ్ మార్బుల్, రెజిన్.. ఇలా రకరకాల రాళ్లతో ఫ్యాన్సీ నగలు రూపొందుతున్నాయి. ఈ మాడళ్లలో ఎక్కువగా సన్నటి గొలుసుకు తగిలించుకునేలా రంగురంగుల లాకెట్లు దొరుకుతున్నాయి. వాటికి తగ్గట్టు ఉంగరాలు, జుంకాలు కూడా వస్తున్నాయి.

# పచ్చదనం.. పరిరక్షకులు





పచ్చదనం.. పరిరక్షకులు అసలే అడవి. అక్కడక్కడా పులులు. హఠాత్తుగా స్మగ్లర్ల దాడులు. అడవిని కాపాడుతూ, వన్యమృగాలకు రక్షణనిస్తూ, స్మగ్లర్ల పాలిట సింహస్వప్నంగా నిలుస్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోపనిచేస్తున్న నూట నలభైమంది.. అటవీశాఖ మహిళా ఉద్యోగులు. ఒత్తిళ్లను ఎదుర్కొంటూ, సవాళ్లను అధిగమిస్తూ అడవిలో నిర్భయంగా విధులు నిర్వర్తిస్తున్న ఫారెస్టు అధికారులు, బీట్ సిబ్బందిపై ప్రత్యేక కథనం..

అసలే అడవి. అక్కడక్కడా పులులు. హఠాత్తుగా స్మగ్లర్ల దాడులు. అడవిని కాపాడుతూ, వన్యమృగాలకు రక్షణనిస్తూ, స్మగ్లర్ల పాలిట సింహస్వప్నంగా నిలుస్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోపనిచేస్తున్న నూట నలభైమంది.. అటవీశాఖ మహిళా ఉద్యోగులు. ఒత్తిళ్లను ఎదుర్కొంటూ, సవాళ్లను అధిగమిస్తూ అడవిలో నిర్భయంగా విధులు నిర్వర్తిస్తున్న ఫారెస్టు అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం అటవీ ప్రాంతం విస్తారమైంది. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండలం నుంచి వైరా నియోజకవర్గం వరకు 4,17,383 హెక్టార్లలో విస్తరించి ఉంది. పచ్చదనాల పట్టుచీర కట్టుకున్న ఆ అడవి తల్లిని అటవీశాఖ మహిళా ఉద్యోగులు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. వన సంపదను ఎత్తుకెళ్లడానికి గద్దల్లా ఎదురుచూసే స్మగ్లర్లకు సవాలు విసురుతున్నారు. వన్యప్రాణుల చర్మమాంసాలతో వ్యాపారం చేసుకునే రక్త బేహారులకూ ఇక్కడ కొదవ లేదు. ఆ పహరా బృందం అడుగుల చప్పుడు వినిపిస్తే చాలు.. స్మగ్లర్లకు వణుకే. విద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపే ఆ మహిళలు, మూగ జీవాలు కనిపిస్తే మాత్రం మాతృప్రేమ కురిపిస్తారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తారు. పచ్చగడ్డివేసి పొట్ట నింపుతారు. వేసవిలో అయితే.. మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ గార్డులు, సెక్షన్ అధికారులు, డీఆర్ఓలు, రేంజ్ అధికారులు.. హోదా ఏదైనా అదే నిబద్ధత. అంతే చిత్తశుద్ధి. ఉన్నతాధికారులు సైతం ఆ అంకిత భావాన్ని ప్రశంసించిన సందర్భాలు అనేకం.

**అనుక్షణం సవాళ్లే..**

ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో.. అటవీశాఖ మహిళా ఉద్యోగులు మగవాళ్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కిలోమీటర్ల దూరం కాలి నడకనే వెళు_న్నారు. ఎక్కడ ఏ క్రూర మృగాలు ఉంటాయో తెలియని పరిస్థితి. అయినా ధైర్యంగా అడుగు ముందుకేస్తారు. అక్రమ ఇసుక వ్యాపారుల ఆట కట్టిస్తూ..

ప్రకృతికి, పచ్చదనానికి అండగా నిలుస్తున్నారు. సీసీ కెమెరాల నిఘాతో చీమ చిటుక్కుమన్నా కనిపెట్టేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద మరింత అప్రమత్తంగా ఉంటున్నారు. 'అడవి, అడవిలోని ప్రాణులు-ఈ రెండూ మాకు రెండు కళు_' అంటారు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జి.శ్రీదేవి. 'అడవిలో పనిచేయడం సవాలే అయినా.. ఇష్టంగా చేస్తున్నాం. అధికారులు కూడా మద్దతుగా నిలుస్తున్నారు. ఇది మా అదృష్టం' అని వివరిస్తారు మరో బీట్ అధికారి శారద. 'మొక్కలు పెంచడం నా లక్ష్యం. అందుకే కోరికోరి ఈ ఉద్యోగంలో చేరాను. మనం ఎన్ని చెట్లు పెంచితే.. పకృతి మనకు అంత మంచి వాతావరణాన్ని ఇస్తుంది. పర్యావరణం బాగుండాలంటే.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. అడవిని కాపాడాలి. పకృతి ఒడిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా' అంటున్నప్పుడు బీట్ ఆఫీసర్ అనూష మాటల్లో పచ్చదనం పట్ల అవ్యాజమైన ప్రేమ. 'జీవవైవిధ్యమే ప్రకృతి సమతౌల్యానికి ప్రాణం. సృష్టిలోని ప్రతి జీవికీ బతికే హక్కు ఉంటుంది. అందుకే, మేం అడవిలో నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నాం. అడవి నిండా జంతువులు ఉంటే.. స్మగ్లర్లు అటువైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయరు' అని వివరిస్తారు దుర్గ.

స్త్రీని ప్రకృతితో పోలుస్తారు కవులు. ఆ ప్రకృతి సంరక్షణ బాధ్యత సాక్షాత్తు స్త్రీకే అప్పగిస్తే.. తనను తాను రక్షించుకున్నట్టు అడవిని కాపాడుకుంటుంది ఆమె. తన బిడ్డల్లానే వన్యమృగాలనూ పోషిస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్నది ఆ అద్భుతమే.

అటవీశాఖలో ఉద్యోగం అంటే రోజూ సవాళ్లే. ఓ సందర్భంలో ఊరు ఊరంతా ఎదురుతిరిగింది. దాడికి వచ్చింది. అయినా బీట్ ఆఫీసర్ అనూష.. వెనక్కి తగ్గలేదు. చాకచక్యంగా గుంపును చెదరగొట్టారు. తానూ సురక్షితంగా బయటపడ్డారు. కొన్నిసార్లు వేటగాళ్లు కంట్లో కారం చల్లే ప్రయత్నం చేస్తారు. స్మగ్లర్లు ప్రాణాలు తీస్తామని బెదిరిస్తారు. అవేవీ.. మహిళా సిబ్బంది ఆత్మస్థయిర్యాన్ని తగ్గించలేక పోయాయి. చేతిలో గన్ లేకపోతేనేం, ఒంటి మీద ఖాకీ యూనిఫామ్‌నే ఆయుధంగా భావిస్తారు.

# వినూత్న.. సృష్టికర్త!







నగలంటే ఏ లోహంతోనో చేసినవి అనుకుంటాం. కానీ పూలు, పండ్లు, గింజలతోనూ ఆభరణాలు రూపొందిస్తున్నారు 'బయో జువెలరీ' డిజైనర్ సృష్టి ఘనావత్. ఆమెది జైపూర్. నగలంటే ఏ లోహంతోనో చేసినవి అనుకుంటాం. కానీ పూలు, పండ్లు, గింజలతోనూ ఆభరణాలు రూపొందిస్తున్నారు 'బయో జువెలరీ' డిజైనర్ సృష్టి ఘనావత్. ఆమెది జైపూర్. చదువుకునే రోజుల్లోనే పర్యావరణానికి హాని కలిగించని నగలు తయారు చేయాలనే ఆలోచన వచ్చింది సృష్టి ఘనావత్‌కు. అలా, దేశంలోనే మొదటి బయోజువెలరీ బ్రాండ్ స్థాపకురాలైంది. '..అది కూడా సహజ సిద్ధంగా దొరికేవి, ఎంత సేకరించినా తరిగిపోని వాటితోనే నగలు తయారు చేయాలని సంకల్పించాను. అందుకే నా మనసు పూలు, పండ్లు, గింజలు, సుగంధ ద్రవ్యాల్లాంటి వాటి మీదికి పోయింది. వీటిని నగల్లో ఎలా ఇమడ్చాలనే కోణంలో చాలా కసరత్తు చేశాను. ఇది ఆరంచెల ప్రక్రియ. చివరి దశలో.. ఎక్కువకాలం మన్నేలా కోటింగ్ ఇస్తాం.

చివరగా ఇరవై నాలుగు క్యారెట్ల బంగారంతో పూత పూస్తాం. ఫినిషింగ్ తర్వాత అచ్చమైన బంగారు ఆభరణాల్లానే అనిపిస్తాయి. అన్నట్టు, ఇటీవల మేం తీసుకొచ్చిన స్పైస్ కలెక్షన్‌కు మంచి పేరొచ్చింది. ఇందులో లవంగాలు, దాల్చిన చెక్క, మొగ్గ, మిరియాలు, పువ్వు.. లాంటి మసాలా దినుసులతో చెవి దుద్దులు, బ్రేస్‌లెట్లు, గొలుసులు రూపొందించాం. ఇవి కాక ఖర్జూరాలు, శీకాకాయలాంటివీ మా ఆభరణాల్లో ఇమిడిపోయాయి. పర్యావరణాన్ని ప్రేమించే వారంతా ఈ నగల్నీ ఇష్టపడుతారు' అంటారు సృష్టి. బయో జువెలరీ అంటే ప్రకృతికి మరింత అందాన్ని అద్దడమే!

# బీపీ ఉన్నట్టు ఎలా తెలుస్తుంది..?



ఆరోగ్యవంతులకు రక్తపోటు 120/80కి మించి ఉండరాదు. కానీ, నేడు మధ్య వయసు దాటిన చాలా మందిలో బీపీ ఈ లెవల్స్ కు పైనే ఉంటోంది. అది కొంత కాలానికి హైపర్ టెన్షన్ గా మారుతోంది. జీవన విధానం మారిపోయింది. ఉద్యోగం, ఇంట్లోనూ రకరకాల ఒత్తిళ్ల కారణంగా బీపీ నియంత్రణ దాటుతోంది. రక్తపోటు నియంత్రణలో ఉంచుకోకపోతే ధమనులను దెబ్బతీస్తుంది. శరీరంలోని కీలక అవయవాలపై ప్రభావం చూపెడుతుంది. అందుకే వైద్యుడి సూచనల మేరకు బీపీ నియంత్రణలో ఉంచుకోవడానికి మందులు వాడాల్సి ఉంటుంది. బీపీ ఎంతుంటుందో క్రమం తప్పకుండా పరీక్షించుకోవాల్సి ఉంటుంది.

**ఏందుకు ఈ రక్తపోటు...?**

గుండె నుంచి రక్తాన్ని ధమనులు శరీరంలోని అన్ని భాగాలకు తీసుకెళతాయి. గుండె రక్తాన్ని చాలా ఒత్తిడితో పంప్ చేస్తుంది. దాంతో అది వేగంగా ధమనుల ద్వారా ప్రయాణం చేస్తుంది. ఈ ఒత్తిడినే రక్తపోటు అంటారు. బ్లడ్ ప్రజర్ అందరిలోనూ ఉంటుంది. 120/80కు తక్కువగా ఉన్నంత వరకూ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు రావు. కానీ ఈ ఒత్తిడి పెరిగిపోతేనే ఎన్నో రకాల సమస్యలు మొదలవుతాయి. 120/80కు మించి 140/90 లోపు ఉంటే దాన్ని ప్రీ హైపర్ టెన్షన్ గా చెబుతారు. అదే 140/90 అంతకంటే ఎక్కువ ఉంటే స్టేజ్ 1 హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) గా చెబుతారు. 160/100 కంటే ఎక్కువ ఉంటే స్టేజ్ 2 హైపర్ టెన్షన్ గా, అంతకంటే అధికంగా ఉంటే తీవ్ర సమస్యగా పరిగణించాలి. 60 ఏళ్లు దాటిన వారికి 150/90 ఉంటేనే హైపర్ టెన్షన్ ఉన్నట్టు అర్థం చేసుకోవాలి. అదే విధంగా ఈ రక్తపోటు 85/55 వరకు తగ్గినా ఇతరత్రా ఎలాంటి లక్షణాలు లేకుంటే కంగారు పడక్కర్లేదు. తక్కువగా ఉండి కళ్లు తిరుగుతున్నా, తల తిరుగుతున్నా, మూర్ఛిల్లుతున్నా, ఏకాగ్రత లేకపోయినా, కళ్లు బైర్లు కమ్ముతున్నా, వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లాలి. హైపర్ టెన్షన్ ఉన్న సమయంలో తలపోటు, తల వెనుక మెడపై భాగంలో బాగా లాగినట్టు ఉండడం, చిరాకు, కోపం తదితర లక్షణాలు కొందరిలో కనిపించవచ్చు. కొంత మందిలో పైకి ఎలాంటి లక్షణాలు కనిపించవు.

**హైపర్ టెన్షన్ ఉంటే వైద్యుడి చెకప్ అవసరం**

హైపర్ టెన్షన్ ఉన్నవారు ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్ ను సంప్రదించాలి. అప్పుడు మీ వైద్య చరిత్ర, ఏవైనా గుండె జబ్బులు ఉన్నాయా, పొగ తాగే అలవాటు ఉందా తదితర సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. కొలెస్టరాల్, డయాబెటిస్ ఉందేమోనన్న అనుమానంతో రక్త పరీక్షలకు సిఫారసు చేస్తారు. దీనికితోడు వైద్యులు స్టెతస్కోప్ తో హృదయ స్పందనలను పరిశీలిస్తారు. వేగంగా కొట్టుకుంటుంటే ధమనుల పరిస్థితిని తెలుసుకునేందుకు ఈసీజీ, ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలను సూచించవచ్చు. దీంతో ముందస్తుగా గుండె సంబంధిత సమస్యల బారిన పడకుండా జాగ్రత్తపడవచ్చు.

**ఇంట్లో బీపీ మానిటర్ ఉంటే సేఫ్**

ప్రీ హైపర్ టెన్షన్ లేదా హైపర్ టెన్షన్ సమస్య ఉంటేనే బీపీ మానిటర్ అవసరం అన్న భావన ఉంటే దాన్ని చెరిపేయండి. ఇంట్లో బీపీ మానిటర్ ఉంటే రక్తపోటు నియంత్రణ తప్పకుండా ముందుగానే కట్టడి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. 25 ఏళ్ల వయసు దాటిన వారందరూ నెలకోసారి అయినా బీపీ చూసుకోవడం ద్వారా అది నియంత్రణలో ఉన్నదీ, లేనిదీ తెలుస్తుంది. ప్రారంభంలోనే డాక్టర్ ను సంప్రదించి సూచనల మేరకు జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా హైపర్ టెన్షన్ గా మారకుండా జాగ్రత్త పడవచ్చు. సిస్టోలిక్ ప్రజర్ 180 నుంచి 200 పాయింట్లు దాటితే వారి శరీర ధర్మాన్ని బట్టి పక్షవాతం బారిన పడే ప్రమాదానికి చేరువ అవుతున్నట్టు గుర్తించాలి. శరీరంలో తీవ్ర సమస్య ఉందని తెలుసుకోవాలి. హైపర్ టెన్షన్ ఉన్నవారు ఉదయం వేళ బీపీ మానిటర్ తో రోజుకు ఒక్కసారి అయినా చెక్ చేసుకోవడం ద్వారా ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. స్ట్రోక్ కు గురయ్యే ప్రమాదం ఉన్నవారికి ఉదయం బీపీ ఎక్కువగా ఉంటుందట. వీలుంటే హైపర్ టెన్షన్ బాధితులు ఉదయం, సాయంత్రం కూడా పరీక్షించుకోవడం క్షేమదాయకం.



**బీపీ మానిటర్లలో రకాలు...**

డిజిటల్, మాన్యువల్ అని రెండు రకాల బీపీ పరీక్షా యంత్రాలు అందు బాటులో ఉన్నాయి. మాన్యువల్ అయితే అందులో పాదరసంతో కూడిన స్కేల్ కు ఓ ఎయిర్ బ్యాగ్ (కఫ్) ను పైపు ద్వారా అనుసంధానించి దాన్ని చేతి భుజం కింద కట్టుకోవాలి. 180 పాయింట్ల వరకు గాలి పంప్ చేసి నిదానంగా విడిచిపెట్టాలి. ఆ తర్వాత చేయి మడత భాగంలో కఫ్ కింద స్టేతస్కోప్ ను ఉంచడం ద్వారా బీపీ ఎంతుందో తెలుసుకోవచ్చు. అదే డిజిటల్ అయితే, ఇంత శ్రమ ఉండదు. చేతి పై భాగంలో కఫ్ కట్టేసి బటన్ నొక్కేస్తే చాలు. దానంతట అదే పౌచ్ లోకి గాలిని పంపిస్తుంది. వెంటనే బీపీ ఎంతుందో మానిటర్ లో అంకెల రూపంలో కనిపిస్తుంది. డిజిటల్ లో కూడా మూడు రకాలు ఉన్నాయి. అప్పర్ ఆర్మ్, రిస్ట్, ఫింగర్ బీపీ మానిటర్లు. అప్పర్ ఆర్మ్ అంటే భుజం కింద చేతికి పై భాగంలో కట్టుకునేది. రిస్ట్ కు కట్టుకుని పరీక్షించుకునే దానిని రిస్ట్ మానిటర్ గా పేర్కొంటారు. వేలుకి కట్టుకునే మానిటర్ ఫింగర్ మానిటర్.

**వైర్ లెస్**

వైర్ లెస్ గా పనిచేసేవి కూడా ఉన్నాయి. కఫ్ ను చేతికి కట్టుకోవాలి. బ్లూటూత్ ద్వారా యాండ్రాయిడ్ లేదా ఐఫోన్ లో బీపీ ఎంతుందో చూసుకోవచ్చు. క్వార్డియో, ఐ హెల్త్ తదితర బ్రాండ్లు ఈ రకం మానిటర్లను విక్రయిస్తున్నాయి. ఇందులో ఐ హెల్త్ మానిటర్ ధర ఫ్లిప్ కార్ట్ లో రూ. 5వేలు.

**ఫలితాల్లో కచ్చితత్వం**

వైద్యులు నాణ్యమైన, ప్రమాణాలతో కూడిన బీపీ మానిటర్లను ఉపయోగిస్తుంటారు. మరి ఇంట్లో పరీక్షించుకోవడానికి సౌకర్యంతో పాటు ఫలితాల కచ్చితత్వం కూడా అవసరం. డిజిటల్ లో రిస్ట్ మానిటర్లు కంటే హృదయానికి దగ్గరగా చేతికి కట్టే అప్పర్ ఆర్మ్ మానిటర్లలో ఫలితాల కచ్చితత్వం ఎక్కువ. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కూడా అప్పర్ ఆర్మ్ డిజిటల్ మానిటర్లను మాత్రమే సిఫారసు చేస్తోంది. రిస్ట్, వేలికి ధరించే బీపీ మానిటర్లలో ఫలితాల కచ్చితత్వం తక్కువ కనుక వాటిని సూచించలేదు. ఇక సంప్రదాయ బీపీ మానిటర్ లోనూ ఫలితాలు కచ్చితంగానే ఉంటాయి. డిజిటల్ బీపీ మానిటర్లలో బీపీ ఎక్కువగా ఉంటే రెడ్ కలర్, సాధారణంగా ఉంటే గ్రీన్ కలర్ లో ఫలితాలు కనిపించే సౌకర్యం ఉంది. హైపర్ టెన్షన్ రేంజ్ లో ఉంటే హెచ్చరించే మెషిన్లు కూడా ఉన్నాయి. గతంలో చూసుకున్న రీడింగ్స్ ను భద్రపరిచే సౌలభ్యం కూడా అన్నింటిలో ఉంటోంది. సుమారు 100 నుంచి 200 వరకు రీడింగ్స్ స్టోర్ అయి ఉంటాయి. వైద్యుడు దగ్గరకు వెళ్లినప్పుడు చూపించేందుకు ఈ డేటా ఉపయోగకరంగా ఉంటుంది.

**కఫ్ సైజు**

కఫ్ సైజు చేతికి సరిపోయే విధంగా ఉండాలి. అలాగే సరిగా ధరించాలి. అప్పుడే కచ్చితమైన రీడింగ్ వస్తుంది. పిల్లలకు, పెద్దలకు ఒకే సైజు కఫ్ సరిపోదు. అందుకే వాడే కఫ్ సరిపోకపోతే పెద్దల కోసం మరొకటి కొనుగోలు చేసుకుంటే సరి. కఫ్ లలో స్మాల్, మీడియం, లార్జ్ సైజులు ఉంటాయి. స్మాల్ అంటే 7.1నుంచి 8.7 అంగుళాల మేర కఫ్ పొడవు ఉంటుంది. మీడియంలో 8.8 నుంచి 12,8 అంగుళాలు, లార్జ్ లో 12.8 నుంచి 18 అంగుళాల మేర ఉంటుంది. ఎక్కువ శాతం బీపీ మానిటర్లు మీడియం సైజు కఫ్ తో విక్రయానికి వస్తుంటాయి.

**అడాప్టర్లు ఉన్నవి అయితే బెటర్**

డిజిటల్ మానిటర్లు బ్యాటరీల సాయంతో పనిచేస్తాయి. బ్యాటరీలతోపాటు అడాప్టర్లతో పనిచేసేవి కూడా ఉన్నాయి. అడాప్టర్ అయితే నేరుగా కరెంట్ ప్లగ్ పిన్ కు అనుసంధానించుకుని పరీక్షించుకోవచ్చు.

**సైలెంట్ కిల్లర్. రక్తపోటు (బ్లడ్ ప్రజర్/బీపీ)కి మరోపేరు. బీపీని నియంత్రణలో ఉంచుకోకపోతే అది ఎన్నో సమస్యలకు కారణమవుతుంది. హార్ట్ ఎటాక్, పక్షవాతం, కిడ్నీ ఫెయిల్యూర్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. మరి బీపీ నియంత్రణలో ఉందా? లేదా? అన్నది ఎలా తెలుస్తుంది...? బీపీ మానిటర్ ద్వారా క్రమం తప్పకుండా పరీక్షించుకుంటే సరి. అందుకోసం ఆస్పత్రి చుట్టూ తిరగడం కంటే ఓ మంచి బీపీ మానిటర్ ను ఇంట్లో ఉంచుకోవడం ఉపయోగకరం. మరి కొనే ముందు పరిశీలించాల్సిన విషయాలు ఉన్నాయి. అలాగే, బీపీ గురించి చాలా విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.**

## గుడ్డెందుకు తినాలి?

**గుడ్డు పోషకాల నిలయం. ఇందులో మాంసకృత్తులు (ప్రోటీన్), అత్యవసరమైన 9 అమైనో ఆమ్లాలు, బి కాంప్లెక్స్ విటమిన్లు, డి విటమిన్, ఖనిజాలు దండిగా ఉంటాయి. గుడ్డు తింటే బరువు పెరుగుతుందని చాలామంది భావిస్తుంటారు. దీనికి కారణం పచ్చసొనలోని కొలెస్ట్రాలే.**



అయితే గుడ్డులో కొలెస్ట్రాల్ స్థాయులు ఎక్కువగా ఉన్నప్పటికీ.. దీంతో రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు అంత ఎక్కువగా ఏమీ పెరగటం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో కేలరీలు తక్కువ. పైగా చాలాసేపటి వరకు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఫలితంగా త్వరగా ఆకలి వేయదు. ఇలా ఇది పరోక్షంగా బరువు తగ్గటానికీ తోడ్పడుతుందన్నమాట.

కణాల పనితీరు, వాటి ఎదుగుదల, శక్తిని అందించటంతో పాటు శరీరంలో జరిగే పలు జీవక్రియలకు అవసరమైన పోషకాలు గుడ్డుతో లభిస్తాయి.

దీని పచ్చసొనలోని ఐరన్ మన శరీరం తేలికగా గ్రహించటానికి అనువుగానూ ఉంటుంది.

గుడ్డులోని ల్యూటీన్ అనే యాంటీ ఆక్సిడెంటు కంటి జబ్బుల ముప్పు తగ్గటానికి తోడ్పడుతుంది. వృద్ధాప్యంలో మెదడు ఆరోగ్యంగా ఉండటానికీ ఇది దోహదం చేస్తుంది.

రోజుకు ఒక గుడ్డు తినేవారిలో పక్షవాతం ముప్పు 12 శాతం వరకు తగ్గుతున్నట్టు ఒక పరిశోధనలో వెల్లడైంది.

## పొటాషియం తగ్గితే..



ఖనిజ లవణాల్లో ఒకటైన పొటాషియం మనకు ఎంతగానో తోడ్పడుతుంది. నాడులను, కండరాలను నియంత్రించటం దగ్గర్నుంచి.. ఆహారం జీర్ణం కావటం వరకూ ఎన్నో పనుల్లో పాలు పంచుకుంటుంది. అందుకే పొటాషియం లోపిస్తే కండరాలు పట్టేయటం, గుండె కొట్టుకునే వేగం మారిపోవటం, చర్మం పొడిబారటం, మొటిమలు, అజీర్ణం వంటి సమస్యలెన్నో ముంచుకొస్తాయి. పొట్టుతీయని ధాన్యాలు, మాంసం, చిక్కుళ్లు, పండ్లు, కూరగాయల్లో పొటాషియం దండిగా ఉంటుంది. ముఖ్యంగా అరటిపండు, చిలగడదుంపలతో పుష్కలంగా లభిస్తుంది. అందుకే పండ్లు, కూరగాయలు అంతగా తినకుండా చిప్స్ వంటి చిరుతిళ్లు ఎక్కువగా తినేవారిలో దీని లోపం ఎక్కువగా చూస్తుంటాం.

## బ్యాక్టీరియా 'ఆయుష్షు'!



మన ఆరోగ్యం విషయంలో పేగుల్లోని బ్యాక్టీరియా చాలా కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్ట పిండి పదార్థాలను జీర్ణం చేయటం దగ్గర్నుంచి రోగనిరోధకవ్యవస్థకు తర్ఫీదు ఇవ్వటం వరకూ ఎన్నెన్నో పనులు నిర్వర్తిస్తుంది. అంతేనా? ఇది ఆయుష్షు పెరగటానికీ తోడ్పడుతున్నట్టు తాజాగా బయటపడింది. వృద్ధుల ఆరోగ్యం మెరుగ్గా ఉండటానికీ పేగుల్లోని బ్యాక్టీరియాకూ గణనీయమైన సంబంధం కనబడుతుండటమే దీనికి నిదర్శనం. మంచి ఆరోగ్యంగా ఉన్న 90 ఏళ్ల వృద్ధుల్లో కూడా యువ ఆరోగ్యవంతుల పేగుల్లో మాదిరిగానే బ్యాక్టీరియా రకాలు కనబడుతున్నట్టు తేలింది మరి. వృద్ధుల ఆరోగ్యానికి బ్యాక్టీరియా దోహదం చేస్తోందా? ఆరోగ్యవంతుల పేగుల్లో మంచి బ్యాక్టీరియా ఉంటోందా? అనేది స్పష్టంగా తెలియనప్పటికీ.. ఈ రెండింటికీ లంకె ఉండటం మాత్రం నిజమని పరిశోధకులు పేర్కొంటున్నారు. అంటే రక్తనాళాల ఆరోగ్యానికి కొలెస్ట్రాల్ మాదిరిగానే వృద్ధుల ఆరోగ్యానికీ పేగుల బ్యాక్టీరియాను జీవసూచికగా భావించవచ్చన్నమాట. అందువల్ల పెరుగు, పులియబెట్టిన పదార్థాల వంటి ప్రొబయోటిక్స్ తీసుకోవటం మంచిది. ఇవి పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడతాయి. ప్రొబయోటిక్స్ కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తాయి, కొన్నిరకాల క్యాన్సర్ల బారినపడకుండా చూస్తాయి. అందువల్ల ఇవి ఆరోగ్యంగా ఉండటానికి, ఆయుష్షు పెరగటానికి దోహదం చేసే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

## ముందస్తు నెలసరికి పాల రక్ష!



కొందరికి కాస్త త్వరగా నెలసరి నిలిచిపోతుంటుంది (మెనోపాజ్). దీంతో ఎముకలు గుల్లబారటం, గుండెజబ్బుల వంటి సమస్యల ముప్పు మరింత పెరుగుతుంది. అయితే క్యాల్షియం, విటమిన్ డి ఎక్కువగా తీసుకోవటం ద్వారా ఇలా త్వరగా మెనోపాజ్ ముంచుకొచ్చే ముప్పును తగ్గించుకోవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గుర్తించాల్సిన విషయం ఏంటంటే- మాత్రల కన్నా క్యాల్షియం, విటమిన్ డి దండిగా గల ఆహారం తీసుకోవటం మూలంగానే ఈ ఫలితం కనబడుతుండటం. ముఖ్యంగా పాలు, పెరుగు వంటి పాల ఉత్పత్తులతో ఇంకాస్త ఎక్కువ ప్రయోజనం చేకూరటం. పాలు, పెరుగు, మజ్జిగ వంటి వాటితో లభించే విటమిన్లు, కొవ్వులు, హార్మోన్లు (ప్రొజెస్టిరాన్, ఈస్ట్రోజెన్ వంటివి) మాత్రల్లో ఉండకపోవటమే దీనికి కారణమని పరిశోధకులు భావిస్తున్నారు.

# సర్వ విఘ్నోప శాంతమూర్తి!

**'ఓం గణానాం త్వా గణపతిగ్ం**
**హవామహే కవిం కవీనా ముపమశ్ర వస్తమమ్**
**జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత**
**ఆ నః శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్.**
**ఓం మహా గణపతయే నమః.**
**– గణపతి స్తోత్రం**

'దేవగణాలకు అధిపతివైన గణపతీ! నిన్ను స్తుతిస్తూ ఆహ్వానిస్తున్నాం. మేధావులలో మేధావిగా, ఉన్నతులలో అత్యున్నతమైన వాడివిగా, వేదాలకు ఆద్యునివిగా నిన్ను ఆరాధిస్తున్నాం. మా వినతులను ఆలకించి మమ్ము కటాక్షించ వలసిందిగా ప్రార్థిస్తున్నాం. నీకు నమస్కారం...'

ప్రస్తుత శ్వేత వరాహ కల్పంలో పేర్కొన్న విధంగా వినాయకుని పుట్టుక భాద్రపద శుద్ధ చవితి రోజున జరిగింది. పార్వతీదేవి తను అభ్యంగన స్నానం చేస్తూ, శరీరంపై ఉన్న మట్టితో చేసిన ఆకృతికి ప్రాణం పోసింది. అతనిని ద్వారానికి కాపలా పెట్టడం, అది తెలియక వచ్చిన శంకరుడు, తనను అడ్డగించిన ఆ బాలుని తలను ఖండించడం, తిరిగి పార్వతి ప్రార్థనను అనుసరించి గజముఖాన్ని అమర్చి ప్రాణం పోయడం... వినాయకుని పుట్టుక ఇతివృత్తంగా చెప్పబడింది. అందుకే, భాద్రపద శుద్ధ చవితిని వినాయకుని పుట్టిన రోజుగా జరుపుకుంటున్నాం. అలాగే, భాద్రపద బహుళ చతుర్థిని ఆయనకు గణాధిపత్యం లభించిన రోజుగా జరుపుతున్నాం.

**పుట్టుకలోనే పృథ్వీతత్త్వం!**

పార్వతీ దేవి శరీరపు మట్టినుండి వినాయకుడు ఆవిర్భవించాడు. ఈ కారణంగా వినాయకుని అర్చన సమయంలో 'మట్టి విగ్రహాన్ని' అర్చించడమే ఉత్తమంగా శాస్త్రాలు చెబుతున్నాయి. పార్థివ (మట్టి) గణపతిని పార్వతికూడా శ్రావణ శుద్ధ చతుర్థి నుండి భాద్రపద శుద్ధ చతుర్థి వరకు అర్చించినట్లుగా 'గణేశ పురాణం'లో పేర్కొన్నది. అంతేకాక, గణపతిది పృథ్వీ తత్త్వం. కాబట్టి, మట్టి విగ్రహాన్నే ఆరాధించాలని పురాణాలు చెపుతున్నాయి. 'ఆదౌ పూజ్యో గణాధిపః'. ఏ శుభ కార్యం సంకల్పించినా కార్య నిర్వహణలో ఎదురయ్యే విఘ్నాలను తొలగించే వానిగా ముందుగా వినాయకుడిని అర్చిస్తుంటాం. అతడే అగ్రపూజలు అందుకోవడం సంప్రదాయంగా వస్తున్నది. సృష్టి కార్యాన్ని ప్రారంభించే సమయంలో బ్రహ్మ ముందుగా గణపతిని పూజించినట్టు ఋగ్వేదాన్ని ఉదహరిస్తూ చెపుతారు. పురాణాల ప్రకారం విజ్ఞానానికి, తేజస్సుకు ప్రతీకగా గణపతిని చెపుతారు. పంచమ వేదంగా ప్రసిద్ధమైన 'మహాభారతాన్ని' వేద వ్యాసుడు చెపుతుండగా గణపతి లిఖించాడని చెప్పబడింది.

**సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపం**

గణం అంటే సమూహం. గణాలతో నిండి వున్న ఈ సమస్త విశ్వానికి అధిపతి గణపతి. అలాగే, అహంకారానికి ప్రతీక అయిన 'ఎలుక'ను శాసించి వాహనంగా చేసుకున్న గణపతిని, మహా గణపతి, హరిద్రా గణపతి, స్వర్ణ గణపతి, ఉచ్ఛిష్ట గణపతి, సంతాన గణపతి, నవనీత గణపతి అని 6 రూపాల్లో పూజిస్తారు. 'గణపతి అథర్వ శీర్షం' ఆయన్ని పరబ్రహ్మగా చెపుతుంది. 'నమస్తే గణపతయే... నీ ముందు అహంకార రహితమైన నా మనస్సును సమర్పిస్తున్నాను. హే గణపతీ! ఏదైతే సనాతనమో, ఏదైతే ఆది అంత్యాలు లేనిదో, అనిర్వచనీయమో, భావానికీ శబ్దానికీ అతీతమైందో 'అది' నీవే అయి ఉన్నావు. అన్నింటికీ కర్తవు, ధరించే వానివి, లయం చేసుకునే వానివి నీవే. నీవే బ్రహ్మమూ, సత్యానివీ. నీకు నమస్కరిస్తున్నాను. సకల వాక్సంబంధిత శక్తివి, జ్ఞానమూర్తివి, ఆనంద మయునివి నీవే. పరబ్రహ్మం, శాశ్వతమైన వానివి నీవే. ప్రత్యక్ష పరబ్రహ్మవూ నీవే. నీవే జ్ఞానానివి, నీవే విజ్ఞానానివి' అంటున్నది 'గణపతి అథర్వ శీర్షోపనిషత్తు'. ఏకదంతుడు, నాలుగు చేతులలో పాశం, అంకుశం, దంతం (ఇది ఏనుగు దంతం, త్యాగానికి ప్రతీక), అభయ ముద్రను ధరించిన వాడు, ఎలుక వాహనాన్ని కలిగినవాడు, పెద్ద పొట్టను కలిగి వున్నవాడు, చాటల లాంటి చెవులను కలిగిన వాడు, రక్తవర్ణ వస్త్రాలను ధరించినవాడు, ఎర్రనైన సుగంధాలను పులుముకున్న శరీరం కలిగినవాడు, ఎర్రని పుష్పాలతో చక్కగా పూజింపబడేవాడు, భక్త కోటిపై అమితమైన అనుకంప (దయ) కలిగినవాడు ఎవరోకాదు, గణపతియే. ఇంతేకాదు, భగవంతుడైనవాడు, ఈ జగత్తుకు కారణమైనవాడు, అచ్యుతుడు (జారిపోని వాడు), సృష్టి ఆదిలోనే ఆవిర్భూతుడు, ప్రకృతి పురుషులకు కూడా పరమమైనవాడు ఇన్ని రకాలుగా ఎవరైతే ఉన్నాడో... ఆ మహా గణపతిని నిత్యం ఎవరైతే ధ్యానిస్తారో, వారు యోగులలో శ్రేష్ఠులుగా చెప్పబడతారు.



**ధర్మార్థ కామమోక్షాలకు ప్రతీక!**
**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే?**

తెలుపు స్వచ్ఛతకు, సత్త్వగుణానికి చిహ్నం. ఆకాశమంతటా నిండి వున్నవాడు. సర్వవ్యాపకత కలిగినవాడు. చంద్రుని వంటి లేదా స్వచ్ఛమైన వర్ణం (యశస్సు) కలిగినవాడు, కాలస్వరూపుడు. నాలుగు దిక్కులను భుజాలుగా కలిగినవాడు. అవి శక్తికి నిదర్శనాలు. కాబట్టి, సృష్టిని ధరించి, భరించగలిగిన వాడు గణాధిపతి. నాలుగు భుజాలూ ధర్మార్థ కామమోక్షాలకు ప్రతీక. నిర్మలమైన (సంతుష్టమైన) ముఖం కలవాడు. తనను ధ్యానించడంతోనే అన్ని అడ్డంకులు తొలగిపోతాయి. అతనిని అద్భుత మూర్తిగానే కాక ఆద్యమూ, సర్వవ్యాపితమూ, సర్వజ్ఞానయుతమూ, సర్వశక్తి సమన్వితమూ అయిన అనంత శక్తిని సకల విఘ్నాలు శాంతింపచేయడానికి ప్రార్థించే విధానమిది. ఇది మన సంస్కృతిలోని ఉదాత్తతను తెలుపుతుంది.

**ఆ విజయం వెనుక...**

వినాయకుడు, కుమారస్వామి ఇరువురూ శివపార్వతుల సంతానం. వారిలో ఒకరిని గణాలకు అధిపతిని చేయాలని భావించారు. పిల్లలిరువురూ ఆ పదవి తమకే కావాలని కోరుకున్నారు. అంతర్గతమైన స్పర్ధ వారిమధ్య నెలకొన్నది. అంతర్గత వైరుధ్యాలు, స్పర్ధలు బయటకు రావాలి, వాటిని మూలలలో పరిష్కరించుకోవాలి. దానితో శాంతి అభ్యుదయం కలుగుతుంది. సాధారణంగా తల్లి బలహీనుని ఆదరిస్తుంది. తండ్రి సమర్థుని వైపు చూస్తాడు. పార్వతికి గణపతిలోని లోపాలు తెలుసు కాబట్టి, అతనికి ఈ పదవి రావాలని అనుకున్నది. శివునికి కుమారస్వామి సామర్థ్యం తెలుసు కనుక, అతనికి ఈ పదవిని ఇవ్వాలనుకున్నాడు. ఎవరైనా తమ సత్తా నిరూపించుకొని పొందాల్సిన పదవిని అందుకు విరుద్ధంగా 'పంచడం' సమంజసం కాదు. అయాచితంగా వచ్చిన ఏ ఫలితమైనా విలువను పొందదు. స్పర్ధతో తమ అర్హతను నిరూపించుకోవడం ద్వారా స్థాయి ఉన్నతీకృతమవుతుంది. శ్రేష్ఠత గుర్తింపును, అంగీకారాన్ని పొందాలి. అందుకే, ఆ ఆదిదంపతులు ఆలోచించారు. వారికి ఒక పరీక్షను పెట్టారు. ముల్లోకాలలో ఉన్న పుణ్యనదులలో మూడుసార్లు స్నానం చేసి ముందుగా ఎవరు వస్తారో వారికే గణాధిపత్యాన్ని ఇస్తామన్నారు. వెంటనే కుమారస్వామి తల్లిదండ్రులకు నమస్కరించి తన నెమలి వాహనంపై తీర్థయాత్రలకు వెళ్ళాడు. వినాయకుడు మాత్రం కండ్లు మూసుకొని ధ్యానించాడు. ఆ స్ఫురణతో, అంకిత భావంతో, సమర్పణా భావనతో తల్లిదండ్రులకు ముమ్మార్లు భక్తితో ప్రదక్షిణం చేసి సాష్టాంగంగా నమస్కరించాడు. దానితో అతనికి ముల్లోకాలలోని నదులలో స్నానం చేసిన ఫలితం వచ్చింది. అలా గణాధ్యక్షుడయ్యాడు! దీంతో లోకానికి కుమారస్వామి కష్టించి పనిచేసే విధానం, గణపతి బుద్ధి కుశలత, చురుకుదనాలు నిరూపితమైనాయి. ఇవాళ భౌతిక విజయాలకు ఈ రెండూ అవసరమే. అలాగే, ఆధ్యాత్మిక సాధనలో కష్టమైనా సాధన చేయడం తప్పనిసరి. కనుక, అవరోధాలను అన్నింటినీ దూరం చేసుకోవాలి. అందుకు గణపతే శరణ్యం! ఈ పండుగలోని పరమార్థాన్ని, గణపతి తత్త్వంలోని అంతరార్థాన్ని తెలుసుకొని నిత్య జీవితంలో చురుకుగా ఉండటం, సృజనాత్మకంగా పనిచేయడం, సమర్థతను ప్రదర్శించుకోవడం వంటి వాటివల్ల ఐహిక ఆధ్యాత్మిక మార్గాలలో మనం విజయం సాధించగలుగుతాం. అందుకే, ఎప్పుడూ వచ్చే వినాయక చవితి అయినా, ఎప్పటికపుడు కొత్తగా ఆరాధించడం ద్వారా ఆత్మసంతృప్తిని పొందుతాం.

**సకల విద్యలు, సంపదలు!**

ఐహిక కార్యంలో విజయమైనా, ఆధ్యాత్మిక లక్ష్యం చేరుకోవాలన్నా రెండు ప్రధానాంశాల తోడ్పాటు మనకు కావాలి. ఒకటి బుద్ధి, రెండవది సిద్ధి. విచక్షణ కలిగి, వివేచన చేయగలిగిన 'బుద్ధి'ని సాధించిన వ్యక్తికి కార్య'సిద్ధి' కలుగుతుంది. ఈ రెంటినీ అనుగ్రహించ గలిగిన దైవమే వినాయకుడు. ఎవరు ఇవ్వగలరు? ఉన్నవాడే ఇవ్వగలుగుతాడు. అందుకే, వినాయకునికి ఇరువురు భార్యలను చూపించారు. వారే బుద్ధి (సరస్వతికి ప్రతీక), సిద్ధి (లక్ష్మికి ప్రతీక). గణేశుడి ఆరాధనవల్ల సాధకునికి కలిగే ప్రయోజనాలు కూడా రెండు. ఒకటి క్షేమం. రెండవది లాభం. ఈ రెంటినే ఆయనకు ఇరువురు కుమారులుగా సూచించారు.

# రాధాకృష్ణుల సేవాభాగ్యం



రాధాకృష్ణులు వేర్వేరు కాదని, శ్రీకృష్ణుని అంతర్గత శక్తియైన 'హ్లాదినీ శక్తి' స్వరూపమే ఆమె అని 'శ్రీ చైతన్య చరితామృతం' వెల్లడించింది. సుమారు 5,000 సంవత్సరాల కిందట భగవంతుడు భూమ్మీద అవతరించి తన లీలలను ప్రదర్శించినప్పుడు రాధారాణి కూడా ఆవిర్భవించింది. ఒకనాడు వృషభాను మహారాజు యమునా నదీతీరాన స్నానానికి వెళ్లాడు. నదిలో ఒక బంగారు పద్మం తేలియాడుతూ వేయి సూర్యుల కాంతితో ప్రకాశిస్తూ కనిపించింది. వెంటనే నదిలోకి దిగి దాని దగ్గరకు వెళ్లగా, అందులో ఎంతో అందమైన, ప్రకాశవంతమైన ఒక పాపను చూశాడు. ఆ పాపను ఇంటికి తీసుకువచ్చి తన భార్యయైన కీర్తిదకు చూపించగా, ఆమె పరమానందభరితురాలైంది. సంతానం లేని ఆ దంపతులు ఆ పాప ను అల్లారుముద్దుగా పెంచుకోసాగారు. కానీ, ఆ పాప ఎన్ని రోజులైనా కళ్లు తెరువకపోవటంతో వారు చాలా బాధపడ్డారు. నారదముని సలహాతో ఆమె పుట్టినరోజు సంబురాలను ఎంతో ఘనంగా ఏర్పాటుచేశారు. ఆ వేడుకలకు ఆహ్వానం పొందిన నందమహారాజు దంపతులు కూడా కృష్ణబలరాములతో కూడివచ్చారు. అప్పుడు చిన్ని కృష్ణుడు నేల మీద పాకుతూ ఆ ఉయ్యాల దగ్గరికి వెళ్లి రాధారాణిని చూడటంతోనే ఆమె కళ్ళు తెరిచింది. ఆమె తదేకంగా శ్రీ కృష్ణుడినే కొంచెం సేపు చూస్తుండి పోయింది. రాధారాణి కళ్ళు తెరుచుకోవడంతో వృషభాను, కీర్తిద దంపతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అక్కడున్న వారంతా అది చూసి ఆనందపరవశులయ్యారు. పద్మపురాణం, పాతాళకాండలో శ్రీమతి రాధారాణి సర్వోన్నత శ్రేష్ఠ స్థానాన్ని గురించిన వివరాలున్నాయి. రాధారాణి శ్రీ కృష్ణునకు అత్యంత ప్రియతమురాలు. 'రాధాకుండం' అనే కొలను కూడా అత్యంత ప్రియమైంది. గోపికల్లో రాధయే శ్రీ కృష్ణునకు పరమ ప్రియురాలు. రాధారాణియే శ్రీకృష్ణుని పట్టమహిషి అని కూడా 'బృహత్ గౌతమీయ తంత్రం' పేర్కొన్నది. దివ్య దేవతా స్వరూపిణి అయిన రాధారాణి శ్రీకృష్ణుని అర్ధాంగి. లక్ష్ములలో ఆమెయే ప్రధానురాలు. సర్వాకర్షకుడైన భగవానుని ఆకర్షించే సమస్తాకర్షణలూ ఆమెలో ఉన్నాయి. ఆమెయే దేవదేవుని ఆది అంతరంగశక్తి. శ్రీ మద్భాగవతంలో శ్రీ శుక మునీంద్రులవారు 'రాధ' అనే నామాన్ని ప్రస్తావించిన వైనం 'దశమస్కంధం'లో (10.30.28) చూస్తాం. 'అనయారాధితో నూనం భగవాన్ హరిరీశ్వరః' అనే ఈ శ్లోకంలోని 'ఆరాధితః' అనే మాట రాధారాణిని సూచించేదని శ్రీల విశ్వనాథ చక్రవర్తి ఠాకూరుల వారు తమ భాష్యరచనలో తెలిపారు. శ్రీ కృష్ణుని ఆరాధనకు ప్రతిరూపమే శ్రీమతి రాధారాణి. శ్రీ కృష్ణుని సేవించటంలోనే ఆమె ఎంతో ఆనందాన్ని పొందుతుంది. నిత్యం ఆ దేవదేవుని సేవలో నిమగ్నులై ఉండే లక్ష్మీదేవి, గోపికలకు సైతం రాధారాణియే మూలాధారం. ఈ విషయాన్ని ఆచార్య బలదేవ విద్యాభూషణుల విరచితమైన 'వేదాంత శ్యమంతకం' వెల్లడించింది. 'సమస్త అవతారాల్లో ఏ విధంగా శ్రీకృష్ణుడే స్వయం భగవంతునిగా పరిగణించబడుతాడో, అదేవిధంగా లక్ష్మీదేవి సమస్త అవతారాలకు శ్రీమతి రాధారాణియే ఆదిమూలమై ఉన్నది' (వేదాంత శ్యమంతక (2.37). కనుక, భక్తిమార్గంలోకి ప్రవేశించిన వారందరికీ రాధారాణి చరణాశ్రయమే సర్వశ్రేయస్కరం. ఆమె కృపలేనిదే శ్రీ కృష్ణుని సమీపించడం అసాధ్యం. అందుకే, భక్తులు ముందుగా రాధారాణి కృపను అర్థిస్తారు. తల్లి అనుగ్రహిస్తే తండ్రి తేలిగ్గా ప్రసన్నుడైనట్లు శ్రీకృష్ణుడు వెంటనే వారిని కరుణిస్తాడు. 'రాధాకృష్ణుల సేవాభాగ్యాన్ని' అనుగ్రహించమని ప్రార్థించే సులభమైన మార్గమే 'హరేకృష్ణ' మహామంత్రం. ఇందులోని 'హరే' అనే నామం సైతం శ్రీకృష్ణుని అంతర్గత శక్తియైన రాధారాణిని సూచిస్తుంది. 'హరేకృష్ణ' మంత్రాన్ని నిత్యం జపించడం వల్ల కలి కల్మషాల నుంచి విముక్తులమై, రాధాకృష్ణుల అనుగ్రహాన్ని తప్పక పొందగలం.

# సంసార వృక్షఫలం మోక్షమే!



భగవంతుడు ఈ శరీరాన్ని ఎందుకిచ్చాడనే అసహనంతో ప్రశ్నించేవాళ్లు చాలామంది ఉంటారు. ఈ శరీరం అనేది లేకపోతే ఏ కష్టాలూ ఉండవని వారి తలంపు. అటువంటి వారికి శరీరం విలువ తెలియదనే చెప్పాలి. జన్మలలో మానవజన్మ ఉత్తమమైంది. నిజానికి భగవంతుడు జీవులను ఉద్దేశించి 'మీకే జన్మ కావాలని' అడిగితే ఆయనను 'మానవజన్మ ఇమ్మని' కోరుతాం. ఆశ్చర్యం ఏమంటే, భగవంతుడు మొదట మానవుడినే సృష్టించినట్లు వేదాది గ్రంథాలు చెబుతున్నాయి. 'యః ఈశే అస్య ద్విపదః చతుష్పదః (23-3)' అన్నది యజుర్వేదం. రెండు పాదాలుగల ఉత్తమజన్మ మానవజన్మే. ఆ తర్వాతనే నాలుగు పాదాలు, అంతకంటే ఎక్కువ పాదాలుగల జన్మలు కలిగాయి. జీవకోటికి సుఖదుఃఖాలు అనుభవించడానికే సృష్టి ఉద్దేశితమైంది. మానవ శరీరం సృష్ట్యాదిలో భగవంతుని కరుణతో అయాచితంగా లభించిందే. బుద్ధిమంతులైన మానవులు సృష్టిగతమైన ఈ రహస్యాన్ని తెలుసుకొని వ్యవహరిస్తారు. మానవ శరీరం ఎంతో పుణ్యం చేస్తేగాని లభించదని మనందరికీ తెలుసు. కానీ, మొదట అయాచితంగా భగవంతుడు దాన్ని మనకు ఇచ్చిన విషయమే మన గ్రహింపులోకి రాదు. భగవంతుడే సృష్టికర్త. అతడు యజుర్వేదంలో (స ఓతశ్చ ప్రోతశ్చ విభూః ప్రజాసు. 32-8) చెప్పినట్లు అన్నింటిలోను ఓత ప్రోతమై ఉన్నాడు. ఇక్కడ 'అన్ని' అంటే సర్వ పదార్థాలని భావించాలి. మరి, సృష్టికంటే ముందు 'అతడొక్కడే ఉన్నాడా? అతనిలో ఏమీ లేవా?' అనే ప్రశ్న కలుగుతుంది. దానికి సమాధానం 'ఛాందోగ్యోపనిషత్తు'లో ఉంది. 'సదేవ సౌమ్యేదం అగ్ర ఆసీదేక మేవా ద్వితీయమ్' (6-2-1). సృష్టికంటే ముందు భగవంతుడు ఒక్కడే ఉన్నాడు. అతడు అద్వితీయుడు అనే విషయం 'సత్' పదం వల్ల తెలుస్తున్నది. భగవంతుడు సూక్ష్మ పదార్థాలలోకెల్లా సూక్ష్మమైనవాడు. కనుకనే అంతటా వ్యాపించి ఉన్నాడు. పరమాణువులు సూక్ష్మమైనవి. అవి జ్ఞానం లేనివి. జీవులు వాటికంటే సూక్ష్మమైనవి. అవి జానం కలిగినవి. పరమాణువులకంటే, జీవులకంటేకూడ సూక్ష్మమైనవాడు భగవంతుడు. 'ముండకోపనిషత్తు' దీనిని ధ్రువపరుస్తున్నది. 'సూక్ష్మాచ్ఛ సూక్ష్మాతరం విభాతి' (3-1-7). సూక్ష్మమైన ప్రకృతిని నామరూప జగత్తుగా మార్చినవాడు భగవంతుడే. శరీరధారియైన జీవునికే రూపం, నామం లభిస్తాయి. నిజానికి జీవుడు అణువుకంటే సూక్ష్మమైనవాడు కనుక, అతనికి రూపం లేదు. శరీరంలోకి ప్రవేశించేంత వరకు పేరుకూడా లేదు. ఆత్మజ్ఞానం లేకపోవడం వల్ల తానే శరీరంగా భావించినప్పుడు, శరీరసుఖం కోసం కర్మలు చేస్తూ జన్మలు ఎత్తుతుంటాడు మానవుడు. కానీ, ఈ పాంచభౌతికమైన శరీరంలో తాను ఉన్నట్లు, దానికంటే భిన్నమైనట్లు, దాన్ని వదులుకోవడమే శ్రేయస్కరమైనట్లు ఎప్పుడైతే భావిస్తాడో అప్పుడు మానవుడు పురుషార్థాలపట్ల దృష్టి పెడతాడు. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' అనే సూక్తిని ఆకళింపు చేసుకొని ధర్మకార్యాలే తలపెడతాడు. పరోపకార కర్మలకే ప్రాధాన్యమిస్తూ, యథోచితంగా లభించిన సంపదతో జీవితాన్ని కొనసాగిస్తూ, సుఖాలను అనుభవిస్తూ పరమ పురుషార్థమైన మోక్షం వైపు సాగుతాడు. మనం ఎప్పుడైతే నిష్కామబుద్ధితో కర్మలు చేస్తామో అప్పుడే ప్రకృతి బంధనాలనుంచి బయటపడగలుగుతాం. కర్మనే మనల్ని బంధిస్తుంది. అదే తిరిగి మనలను మోక్షం వైపు మళ్లిస్తుంది. 'కర్మ వై చిత్ర్యాత్ సృష్టి వైచిత్ర్యమ్' (సాంఖ్యం? 6-46). కర్మ వైచిత్రివల్లే ఈ విచిత్రమైన సృష్టి రచన జరిగింది. ఎప్పుడైతే కర్మబంధనాల నుంచి మనకు విముక్తి లభిస్తుందో, అప్పుడే విశ్రాంతి లభిస్తుంది. నదులు ప్రవహిస్తూ సముద్రాన్ని చేరి నామరూపాలు విడిచి కనిపించకుండా పోయినట్లుగా, జ్ఞానికూడా నామరూపాలను విడిచి, పరాత్పరుడైన భగవంతున్ని చేరుకొంటాడు. ఇది నిష్కామకర్మ యోగం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. అటువంటి యోగి తన యోగాగ్నిలో కర్మలను దగ్ధం చేసుకోగలుగుతాడు. సంసార బంధనాలనుంచి బయటపడి మోక్షస్థితిని చేరుకొంటాడు.



# కైకేయిలో అంత స్వార్థమా?

**రామాయణంలో కైకేయి తన భర్త (దశరథుడు)ను కోరరాని వరాలు కోరడం న్యాయమేనా? తన కొడుకు (భరతుడు) మనసు తెలుసుకోకుండా స్వార్థబుద్ధిని చూపడం ఎంతవరకు ధర్మం?**

రామాయణం ఆత్మ ప్రధాన కావ్యం. రాముడు సాక్షాత్తు శ్రీమహా విష్ణువు. ఈ అప్రమేయ తత్త్వాన్ని మానవులు తెలుసుకునేందుకే 'కైకేయి పాత్ర' చక్కగా ఉపయోగపడింది. కైకేయి చేసిన 'రామ పట్టాభిషేక భంగం' అనేది పైకి తప్పు వలె కనిపించినా అది లోక శ్రేయస్సుకు జరిగిన మహోపకారంగానే భావించాలి. ఈ విషయం శ్రీరామునికీ తెలుసు కనుకనే చిన్నమ్మను తప్పు పట్టలేదు. ఇంకా, ఎక్కువగానే గౌరవించాడు. మంథరకూడా దేవతలతో ప్రేరేపితమైందే. దీని వెనుక 'రావణాసుర వధ' అనే ఒక బృహత్ కార్యం దాగి వుంది. ఇది జరగాలంటే, రాముడు అయోధ్యను విడిచి వెళ్లక తప్పదు. ఇంతేకాదు, దట్టమైన అడవులున్న అయోధ్య పరిసర ప్రాంత ప్రజలు అటు క్రూరమృగాలతోనూ, ఇటు రాక్షసులతోనూ పీడింపబడుతూ వున్నారు. 'దుష్ట శిక్షణ- శిష్ట రక్షణ'కు రామ వనవాసం అనివార్యం. అసలు, 'కైకేయి వరాలు' కోరక పోతే రామాయణ కావ్యమే లేదు. అయోధ్య నుండి రాముడు బయటకు వెళ్లడానికి బలమైన కారణంగా 'కైకేయి ఉదంతాన్ని' పేర్కొనాలి. ఆమెకూ తెలుసు 'రాముడు తన తండ్రి మాట కాదనడని'. అందుకే, అలాంటి కోరరాని వరాలనే కోరింది. దాని వెనుక ఒక మాతృహృదయాన్ని చూపించడం గ్రంథకర్త గొప్పతనం. ఎంతమంది చెప్పినా కైకేయి తన పట్టుదల వదలలేదు. 'నువ్వు వరాన్ని ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని' దశరథుడిని బెదిరించింది కూడా. తల్లిని వారించే శక్తి ఒక్క భరతుడికి మాత్రమే ఉంది. కానీ, ఆ సమయంలో అతను మేనమామల దగ్గర ఉన్నాడు. వరాలు, శాపాలు మానవ ప్రవృత్తికి సంబంధించినవే. అవి అన్నీ కర్మ సిద్ధాంతాన్ని అనుసరించే పుట్టాయన్నదీ గమనార్హం.

# ది బెస్ట్ హెరిటేజ్ సిటీ.. బుడాపెస్ట్

స్విట్జర్లాండ్ రాజధాని జ్యూరిక్ నుంచి బుడాపెస్ట్ వరకు రైలు మార్గంలో సాగిన మా ప్రయాణం.. దారిపొడవునా మంచుదుప్పటి కప్పుకొన్న యూరప్ పట్టణాలను, పల్లెలనూ దాటుకుంటూ హంగరీ రాజధానికి చేరుకుంది. ఆ వారసత్వ నగరంలో.. అడుగడుగునా అద్భుతాలే! యూరప్ మొత్తంలో అత్యంత సాంస్కృతిక వైవిధ్యం, గొప్ప చరిత్ర కలిగిన నగరం హంగరీ రాజధాని బుడాపెస్ట్. యూరప్ ఖండం నడిమధ్యన ఉన్న బుడాపెస్ట్ నిజానికి 1873లో మూడు నగరాలు (బుడా, ఓబుడా, పెస్ట్) కలిస్తే ఏర్పడింది. బుడా ఓ కొండమీద ఉంటుంది. డాన్యూబ్ నదికి ఆవల ఉన్న పెస్ట్, ఓబుడా కొంతమేర మైదాన ప్రాంతాలు. గడచిన శతాబ్దకాలంలో రెండు ప్రపంచ యుద్ధాలలో తీవ్రంగా నష్టపోయిన హంగరీ అటు నాజీయిజం నుంచి ఇటు కమ్యూనిజం మీదుగా క్యాపిటలిజం వరకూ అన్ని ఇజాలనూ చవిచూసింది. భిన్నధ్రువాల మధ్య నలిగిపోతూ కష్టనష్టాలకు లోనైంది. మేము బుడా కొండ మీదున్న హిల్టన్ హోటల్‌లో దిగాం. దాని చుట్టూ అనేక పురాతన వారసత్వ కట్టడాలు ఉన్నాయి. తొలిరోజు ఉదయాన్నే లోకల్ టూర్ కోసం క్యాబ్ బుక్ చేసుకున్నాం.





లోకల్ గైడ్‌గా కూడా ఉపయోగపడే డ్రైవర్ కావాలని ముందే చెప్పాం. మేం వెళ్లే సరికి.. నలుపురంగు టొయోటా కారుతో ఆండ్రూ సిద్ధంగా ఉన్నాడు. ముందుగా, పక్కనే ఉన్న కొన్ని ప్రదేశాలు చూశాం.

**ప్రాచీన చర్చి**

మా హోటల్‌కు అనుకుని మత్థేయస్ చర్చి ఉన్నది. క్రీ.శ 1015లో హంగరీ రాజు సెయింట్ స్టీఫెన్ దీన్ని నిర్మించాడట. అనేక యుద్ధాలు, దాడులలో ధ్వంసమైపోవడంతో, 19వ శతాబ్దం చివరన పునర్నిర్మించారు. పక్కనే ఉన్న మరో చారిత్రక కట్టడం.. ఫిషర్మెన్స్ బాస్టియన్. 1700లలో నిర్మించిన ఒక కోటలోని భాగమే ఈ నిర్మాణం. బుడాపెస్ట్‌కు వెళ్లే ప్రతి టూరిస్ట్ ఈ కట్టడాన్ని తప్పక దర్శించాలి. డాన్యూబ్ నదికి సమాంతరంగా 140 మీటర్ల ప్రాకారం ఉంది. దానికి ఉన్న కిటికీల గుండా నగరం మొత్తం దర్శనమిస్తుంది. అక్కడే చాలాసేపు గడిపి, తదుపరి మజిలీకి బయలుదేరాం.



**వేడినీటి బుగ్గలు**

హంగరీకి సముద్ర తీరం లేకపోవచ్చు. కానీ ఈ దేశానికి విలువైన నీటి సంపద ఉన్నది. దేశమంతా విస్తరించి ఉన్న 1300 వేడి నీటి బుగ్గల్లో (హాట్ స్ప్రింగ్స్) 120 వరకూ ఒక్క బుడాపెస్ట్‌లోనే ఉన్నాయి. ఈ హాట్ స్ప్రింగ్స్‌లో ఔషధ గుణాలున్న ఖనిజాలు కరిగి ఉంటాయి. అందుకే, వందల ఏళ్ల క్రితమే ఇక్కడ అనేక స్నానశాలలు వెలిశాయి. బుడాపెస్ట్‌కు వచ్చే టూరిస్టులు ఆ వెచ్చని నీటిలో సేదతీరుతారు. మా క్యాబ్ డ్రైవర్ మమ్మల్ని 1918లో నిర్మించిన గిల్లెర్ట్ థర్మల్ బాత్‌కు తీసుకువెళ్లాడు. మేం స్నానం చేయలేదు కానీ.. ఆ పరిసరాలు చూసి, ఫొటోలు తీసుకుని వచ్చేశాం.

డాన్యూబ్ నది మీద 1840లలో కట్టిన మొదటి వంతెన చెయిన్ బ్రిడ్జ్. బుడా, పెస్ట్ నగరాలను తొలిసారిగా కలిపిన వారధి ఇదే. ఈ నగరంలో ఎత్తయిన భవంతులేవీ కనపడవు. నగరంలో అత్యంత ఎత్తయిన కట్టడాలు రెండే రెండు. ఒకటి సెయింట్ స్టీఫెన్స్ బాసిలికా, మరొకటి హంగరీ పార్లమెంటు భవనం. రెండూ కూడా 96 మీటర్ల ఎత్తే ఉంటాయి. హంగరీ దేశం క్రీ.శ. 896లో ఉనికిలోకి వచ్చింది. కాబట్టే ఆ రెండు భవంతులూ 96 మీటర్లు ఉంటాయని అంటారు. మేం బుడాపెస్ట్ వెళ్లింది జనవరి నెలలో. కానీ ఈ నగరాన్ని చూడటానికి మంచి సమయం.. మే నెల నుంచి అక్టోబర్ వరకు. మిగతా నెలల్లో వాతావరణం మరీ చల్లగా ఉంటుంది. బుడాపెస్ట్ ప్రజా రవాణా వ్యవస్థ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 1866లో మొదలైన ట్రామ్ సర్వీసు నేటికీ విజయవంతంగా నడుస్తున్నది. 1896లో బుడాపెస్ట్‌లో మొదలైన మెట్రో రైలు యూరప్ ఖండంలోనే అత్యంత పురాతనమైనది. ఈ మెట్రోను యునెస్కో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు. సిటీ బస్సులకైతే కొదవే లేదు. చార్జీలూ చవకే. బుడాపెస్ట్‌లో మరో ఆకర్షణ రూయిన్ బార్లు. రెండో ప్రపంచ యుద్ధం, తర్వాతి పరిణామాల్లో బుడాపెస్ట్‌లో కొన్ని భవంతులు శిథిలం అయ్యాయి. ఆ పాడుబడ్డ భవనాలనే ప్రత్యేక థీమ్ బార్లుగా మార్చారు. ఇవి ప్రతి రాత్రీ సందర్శకులతో కిక్కిరిసిపోతాయి.

**పాదరక్షలు.. రక్తపు మరకలు**

మర్నాడు ఉదయం క్యాబ్‌లో కూర్చునేసరికి సన్నగా ముసురు మొదలైంది. మూడు అంచెల దుస్తులు ధరించినా చలి వణికిస్తూనే ఉంది. మా డ్రైవర్ చెయిన్ బ్రిడ్జి దాటి డాన్యూబ్ నది అంచున ఉన్న రోడ్డు పక్కన ఆపాడు. రెండు గొడుగులు ఇచ్చి ఇక నడవమన్నాడు. మాకేమో చలికి వేళ్లు వంకర్లు పోతున్నాయి. కొద్ది దూరం నడిచాక.. జనం గుమికూడి ఉన్నచోట ఆగమన్నాడు. అక్కడ నేల మీద చెల్లాచెదురుగా కొన్ని బూట్లు పడున్నాయి. దగ్గరికి పోయిచూస్తే కానీ నిజం బూట్లు కావని తెలియలేదు. అవి ఇనుముతో చేసిన బూట్ల బొమ్మలు. రెండో ప్రపంచ యుద్ధంలో డాన్యూబ్ నది ఒడ్డున ఊచకోతకు గురైన యూదుల స్మారకార్థం.. హంగరీకి చెందిన కాన్ తోగే అనే సినిమా దర్శకుడు గ్యులా పార్ అనే శిల్పి కలిసి సృష్టించిన 'ద షూస్ ఆన్ ద డాన్యూబ్ బ్యాంక్' అది. వందలాది యూదులను ఆ నది ఒడ్డున నిలబెట్టి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపే ముందు.. ఆ పాదరక్షల్ని ఎవరికైనా అమ్ముకోవచ్చు అనే ఉద్దేశంతో అక్కడ వాటిని విడిపించిందట హంతక ముఠా. ఆ చీకటి రాత్రి నాజీల తూటాలకు నేలకొరిగిన యూదులను తలచుకుంటూ, ఆ బూట్లలో పుష్పాలుంచి భారమైన హృదయంతో



**అక్కడి నుంచి కదిలాం.**

అక్కడికి కూతవేటు దూరంలోనే.. హంగేరియన్ పార్లమెంటు భవనం ఠీవిగా దర్శనమిచ్చింది. 1902లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ భవంతి యూరప్ ఖండంలోనే అతి పెద్ద పార్లమెంటు భవనం కూడా. భవంతి ఆవరణలో 88 మంది హంగేరియన్ పాలకులు, రాజులు, మిలిటరీ కమాండర్ల విగ్రహాలు పెట్టారు. అందులో కొన్నిటి పేర్లు చదువుతూ ముందుకు సాగాం. అక్కడినుంచి నగరంలోని ప్రధాన షాపింగ్ ప్రాంతం వాసీ స్ట్రీట్‌కు తీసుకెళ్లాడు మా క్యాబ్ డ్రైవర్. అక్కడే కొంత షాపింగ్ చేసి, మధ్యాహ్న భోజనం కూడా చేశాం.

**హీరోస్ స్క్వేర్**

రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ పక్షాన నిలిచిన హంగేరియన్ పాలకులు సుమారు ఆరు లక్షల యూదులను ఊచకోత కోశారని చెప్పుకొచ్చాడు మా డ్రైవర్. యుద్ధం ముగిశాక రష్యా అధీనంలోకి వెళ్లింది హంగరీ. అప్పుడు, ఇంకోరకం హత్యాకాండ మొదలైంది. స్టాలిన్ నాయకత్వంలోని రష్యా కనుసన్నల్లో నడిచే ప్రభుత్వాలు మరోరెండు లక్షల మంది హంగేరియన్ల ఉసురు తీశాయి. సుమారు నాలుగు దశాబ్దాల కమ్యూనిస్ట్ పాలన తరువాత.. 1980లో జరిగిన తిరుగుబాటు కారణంగా క్యాపిటలిస్ట్ ప్రభుత్వం వచ్చిందని వివరించాడు. ఆరోజు కూడా ఆకాశం మేఘావృతమైంది. అప్పుడప్పుడూ చినుకులు రాలుతున్నాయి. మాటల్లోనే బుడాపెస్ట్ నడిబొడ్డున ఉన్న హీరోస్ స్క్వేర్ చేరుకున్నాం. 1896లో హంగరీ సహస్రాబ్ది సందర్భంగా ఇక్కడే ఓ స్మారక చిహ్నం నిర్మించారు. 1932లో దీనికి హీరోస్ స్క్వేర్‌గా నామకరణం చేశారు. నలుదిక్కులా అందమైన భవంతులతో, స్క్వేర్ మధ్యలో ఒక భారీ స్తూపంతో ఆకట్టుకునేలా ఉందీ ప్రదేశం. బుడాపెస్ట్‌లో చివరి రోజు సాయంత్రం మిత్రులమంతా డాన్యూబ్ నది ఒడ్డున కూర్చున్నాం. ప్రపంచంలోనే అత్యధికంగా.. పది దేశాల గుండా ప్రవహించే మహానదిలో నిర్మలంగా పారుతున్న ఆ నీటికేసి చూస్తే.. ఇజాల మత్తులో పడి మూర? పుమానవులు ఈ నదిలో ఎంత నెత్తురు పారించారో కదా అనిపించింది. మనసు చివుక్కుమంది.

# హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో తిరిగొచ్చే ఈ టూరిస్ట్ స్పాట్స్ తెలుసా !







సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సెలవురోజు, వీకెండ్ వచ్చిందంటే చాలు.. అందమైన పర్యాటకం.. అనురాగాల ప్రయాణం అంటూ.. నగరవాసులు విహార యాత్రలకు జై కొడుతున్నారు. ఉరుకులు..పరుగుల జీవన ప్రయాణంలో ఇల్లూ.. ఆఫీసుల మధ్య పనుల ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు.. కాసేపు ప్రకృతి ఒడిలో ఓలలాడుతున్నారు. మరీ కొత్త ప్రదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా.. కాస్త పరిచయం ఉన్న చోట్లకే టూర్లు వేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఒక్కరోజులో చూడగల పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**లక్నవరం సరస్సు..** నగర పర్యాటకులను ఆకర్షించే ముఖ్యమైన వాటిల్లో లక్నవరం ఒకటి. హైదరాబాద్ నుంచి 220 కిలో మీటర్లు. ఈ ప్రదేశం చుట్టుపక్కల ఉండే ఏటూరునాగారం అభయారణ్య సందర్శకులను కనువిందు చేస్తున్నది. లేక్ క్రాసింగ్, రోప్ కోర్సులు, కయాకింగ్ వంటివి అందుబాటులో ఉంటాయి. దీనికి సమీపంలో బొగత జలపాతం కూడా కనువిందు చేసే పర్యాటక ప్రాంతం.

**శామీర్‌పేట్ లేక్..** హైదరాబాద్ శివారు ప్రాంతమైన శామీర్‌పేట్ సికింద్రాబాద్‌కు 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ ఎన్నో విలాసవంతమైన రెస్టారెంట్లు, హోటళు ఉన్నాయి. ఇక్కడ ఉన్న జింకల పార్క్‌లో జింకలతో పాటు నెమళ్లు, అనేక రకాల పక్షులు కనిపిస్తాయి.

**డిండి..** నల్గొండ జిల్లాలో ఉంది. హైదరాబాద్ నుంచి 108 కిలోమీటర్ల దూరం. సుమారు 2:30 గంటల జర్నీ. ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా ఉన్న డిండిలో సుందరమైన దృశ్యాలు అనేకం. ట్రెక్కింగ్, బ్యాక్ వాటర్ ట్రిప్స్‌తో ఎంజాయ్ చేయొచ్చు. శ్రీశైలానికి వెళ్లేదారిలో డిండిని చూసేందుకు పర్యాటకులు ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. నీటి అందాలతో సెల్ఫీలు దిగి సందడి చేస్తారు.

**కొండపోచమ్మ..** నూతనోత్తేజాన్ని నింపే అత్యుత్తమ క్యాంపింగ్ ప్రదేశంగా దీనిని చెప్పవచ్చు. హైదరాబాద్‌కు 50 కిలో మీటర్ల దూరంలో ఉంది. సిద్దిపేట జిల్లాలో ఉన్న ఈ రిజర్వాయర్ అందాలు ప్రత్యేకం. వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అందుకే ఇక్కడ క్యాంపింగ్ చేసేందుకు అధిక శాతం పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

**అనంతగిరి..** ట్రెక్కింగ్ కోరుకునే వారికి అనంతగిరి స్వర్గధామం. వికారాబాద్‌కు కేవలం పది కిలోమీటర్లు.. హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. అనంతగిరి కొండల చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతం.. నిర్మలమైన వాతావరణం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రాచీనమైన అనంతగిరి పద్మనాభ స్వామి ఆలయాన్ని కూడా దర్శించుకోవచ్చు.

**కీసరపోదాం..** ఆధ్యాత్మిక ప్రాంతంగా పరిఢవిల్లుతున్న కీసర.. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి. పక్షుల కిలకిలరావాలు.. 'హరితహారం'తో స్వాగతం పలికే చెట్లు.. సుందరీకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న చెరువులు.. నలువైపులా వీక్షించేలా కొండపై కొలువుదీరిన వ్యూ పాయింట్స్.. అచ్చు ప్రకృతి సంపదతో నిర్మించినట్టుగా అనుభూతి కలిగించే ఆర్నమెంటల్ ఫెన్సింగ్.. ఆరోగ్యాన్ని పంచే ఔషధ మొక్కల కూడళ్లు.. నలువైపులా పరుచుకున్న పచ్చదనంతో కీసర.. పర్యాటకుల డెస్టినేషన్ లిస్టులో మొదటివరుసలోకి చేరింది. సుమారు 1562 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రాంతంలో విభిన్న రకాల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

**రాచకొండ కోట..** నగరం నుంచి 65 కిలో మీటర్ల దూరం. ఇది 14వ శతాబ్దానికి చెందిన కోట. ట్రెక్కింగ్‌కు అనుకూలం. యాదాద్రి–భువనగిరి జిల్లాలో ఉంది. కోట పై నుంచి చూస్తే ఆకుపచ్చని ప్రాంతాల అందాలు కనువిందు చేస్తాయి. హైదరాబాద్ నుంచి 207 కిలోమీటర్ల దూరం. సుమారు 4 గంటల జర్నీ. ఉత్తర తెలంగాణ జిల్లాకు వరప్రదాయిని. గోదావరి నది మీద కట్టిన ఈ ప్రాజెక్టును చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపిస్తారు. బడా పహాడ్ దర్గా, ఖిల్లా జైలు, సిర్నాపల్లి గడీ, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, దేవల్ మసీద్, కందకూర్తి త్రివేణి సంగమం, రామడుగు జలాశయం, అలీసాగర్ తదితర పర్యాటక ప్రాంతాలన్నింటినీ వీక్షించొచ్చు. ప్రముఖ పుణ్యక్షేత్రం ఇది. హైదరాబాద్ నుంచి 5 గంటల ప్రయాణం. సుందరమైన దృశ్యాలకు నెలవు. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం ఆనకట్టను వీక్షించొచ్చు. అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఇది ఒక్కటి. నది ఒడ్డున ఉన్న 12 జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించొచ్చు. భ్రమరాంబదేవి , సాక్షి గణపతి దేవాలయాలు న్నాయి. ప్రకృతి అందాలను వీక్షించొచ్చు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులే కాదు.. నగరానికి చేరువలో అనేక జలపాతాలున్నాయి. అందులో బొగత, నిర్మల్ జిల్లాలో కుంటాల, పొచ్చెర వంటివి ఉన్నాయి.

**నల్లమల అడవులు..** నగరం నుంచి 219 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో క్యాంపింగ్ చేయడం ఎంతో కిక్కిస్తుంది. ప్రకృతివనంలో ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. చుట్టూ ప్రకృతి అందాలతో నిండిన ఈ ప్రాంతంలో పర్యాటకుల సాహసాలను, ఉత్కంఠభరితమైన కార్యకలాపాలను ఆస్వాదించొచ్చు. సాహస భరిత అనుభూతిని పొందేందుకు సరైన డెస్టినేషన్ ఇది. పర్వతారోహణ, శివాలయం, కంబం సరస్సు అందుబాటులో ఉండే ప్రాంతాలు.

**సిటీ చుట్టూ థీమ్‌లు..** ఓఆర్ఆర్ నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో పదికి పైగా ఉన్న థీమ్ పార్కులు పర్యాటకులకు ఎంతగానో చేరువయ్యాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా రావిర్యాలలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.13 వద్ద అందుబాటులో ఉంటే వండర్ లా, శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలోని ఎస్కేప్ అడ్వెంచర్ వాటర్ థీమ్ పార్కు, శంకర్‌పల్లిలోని వైల్డ్ వాటర్ అమ్యూజ్‌మెంట్, వికారాబాద్ సమీపంలో ఉండే డ్రీమ్ వ్యాలీ వాటర్ పార్కులు, వికారాబాద్, భువనగిరి గుట్టల సమీపంలో ఉండే ట్రెక్కింగ్ స్పాట్లకు ప్రైవేటు టూర్ ఆపరేటర్లతోపాటు తెలంగాణ టూరిజం శాఖ కూడా టూర్లను ఆపరేట్ చేస్తున్నది. వీటికి సిటీ నుంచి గంటన్నర వ్యవధిలోనే చేరుకునే వీలు ఉండగా.. ఒకప్పుడు సిటీ దాటి వెళ్లేవారు కూడా ఈ ప్రాంతాలను ఒక్కసారైన సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**బ్బురపరిచే పార్కులు..** హైదరాబాద్ శివారులోనే ఉన్న కండ్లకోయ ఆక్సిజన్ పార్కును అడవిలాంటి ఉద్యాన వనం అనవచ్చు. అటవీశాఖ 75 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ఈ పార్కులో 50 వేల పైచిలుకు చెట్లున్నాయి. పెద్దల కోసం యోగా హాల్, వాక్‌వేలు ఉన్నాయి. పిల్లలకు ఆట స్థలాలున్నాయి. ట్రీహౌస్, పక్షులు సీతాకోకచిలుకల పార్కులు ఉన్నాయి. కుటుంబమంతా కలిసి పిక్నిక్ వెళ్లడానికి చక్కని చోటు ఇది. అలాగే కొత్తగూడలో 120 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బొటానికల్ గార్డెన్స్ ఆహ్లాదాన్ని పంచుతున్నది.

# కృష్ణవేణి తీరంలో పవిత్ర క్షేత్రాలు



**పుష్కరాల సమయంలో కృష్ణలో స్నానాదులు, పూజలు, దానధర్మాలు, పితృ దేవతలకు పిండప్రదానాలు, జపాలు చేస్తే పుణ్య ఫలాలు సంప్రాప్తిసాయని పురాణాలు చెబుతున్నాయి. పుష్కరాలలో నదీ స్నానం చేస్తే పన్నెండు సంవత్సరాలపాటు ఆ నదులలో నిత్యం స్నానం చేసినంత పుణ్య ఫలం లభిస్తుందంటారు. అలాగే జన్మజన్మల పాపాలూ నశించి, మోక్షప్రాప్తి కలుగుతుంది. ఏ నదికి పుష్కరాలు వస్తాయో ఆ నదిపేరును మనం స్నానం చేసేటప్పుడు ముమ్మారు మనస్సులో తలచుకున్నా కొంతమేర పుష్కర స్నానఫలితం పొందచ్చునని శాస్త్రవచనం.**

పుష్కర కాలంలో చేసే ఆయా కర్మల వలన శారీరక, మానసిక మలినాలు తొలగి పవిత్రత, ఆధ్యాత్మిక తేజస్సు కలుగుతాయి. బంగారం, వెండి, భూమి, ధనం, గోవులు, ధాన్యం, లవణం, రత్నాలు, అశ్వం, పండ్లు, బెల్లం, వస్త్రాలు, తైలం, కూరగాయలు, తేనె, పీట, అన్నం, పుస్తకం %ూ% ఇలా ఎవరి శక్తిని బట్టి వారు ఈ పుష్కర సమయంలో దానం చేస్తే పుణ్య ఫలాలు సిద్ధిస్తాయంటారు. మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వతశ్రేణిలో మహాబలేశ్వరం వద్ద ఉద్భవించిన కృష్ణా నది మహాబలేశ్వర లింగం పైనుంచి ప్రవహించి నదిగా మారింది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసలదీవి మీదుగా ఏటిమొగ, ఎదురుమొండి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. తుంగభద్ర, వేణి, మూసీ, దిండి, పాలేరు, మున్నేరు దీనికి ఉప నదులు. వీటిలో తుంగభద్ర, మూసీ నదులు ఇతర జీవ నదులకు మల్లే ప్రఖ్యాతి చెందాయి. కృష్ణానది పుష్కర కాలంలో ఆయా నదిలో స్నానాదికాలు, జప, తపాలతో పాటు ఆయా నదికి సమీపంలో ఉన్న ఆలయాల సందర్శనం ఆధ్యాత్మికానందాన్ని సొంతం చేయడంతో పాటు, మానసికానందన్నిచ్చి, పుణ్య ఫలాలు సొంతమవుతాయని పెద్దలు చెబుతారు. ఆకారణంగా నదికి సమీపంలోనూ, నది ఒడ్డున ఉన్న ఆలయాల సందర్శనం సర్వ విధాల మేలు చేస్తుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటక లోకి ప్రవేశించిన కృష్ణా నది మహబూబ్ నగర్ జిల్లాకు సమీపంలో మక్తల్ మండలంలో తెలంగాణలోకి ప్రవేశిస్తుంది.

**దత్తాత్రేయ స్వామి దేవాలయం వల్లభాపురం(మక్తల్ )**

మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ మండల కేంద్రంలో గల వల్లభాపురం గ్రామంలో వెలసిన మహిమాన్వితమైన దత్తాత్రేయ క్షేత్రం శ్రీపాద శ్రీవల్లభ స్వామి దేవాలయం . దత్తాత్రేయ స్వామి మొదటి అవతారమైన శ్రీపాద శ్రీవల్లభ స్వామి వెలసిన క్షేత్రమిది. శ్రీపాద శ్రీవల్లభ స్వామి జన్మ స్థలం పిఠాపురం అయితే తన తపస్సు, ధ్యానం అన్ని కురవాపురం లోనే జరిగాయని పురాణాల ద్వారా అవగతమవుతోంది. వల్లభాపురం తెలంగాణా, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న మహిమాన్విత దత్త క్షేత్రం. కృష్ణా నదికి ఇవతలి వైపు వల్లభాపురం ఉండగా, అవతలి వైపు కురువాపురం ఉంటుంది.

కృష్ణా నది సమీపంలో వెలసిన మహిమాన్విత దత్త పీఠమిది. శ్రీపాద శ్రీవల్లభ స్వామి దేశమంతా తిరుగుతూ, ఈ క్షేత్రానికి వచ్చి కొన్ని రోజులు ఇక్కడ నివాసముండి భక్తుల కష్టాలు తీర్చాడట. కష్టాలు, కలతలతో బాధపడేవారు, దుష్ట శక్తుల బారి నించి విముక్తి కోరుకునేవారు ఇక్కడ స్వామిని పూజిస్తే కోరికలు నెరవేరుతాయని స్థల పురాణం చెబుతోంది.

కురుపురం, కురువాపురం, కురుంగడ్డ తదితర పేర్లతో పిలుచుకునే శ్రీపాద శ్రీవల్లభ క్షేత్రం తెలంగాణ కర్ణాటక సరిహద్దులో ఉంది. మక్తల్ నుంచి అనుగొండ వెళ్ళే బస్సులో పంచదేవ్ పహాడ్ గ్రామాన్ని చేరుకుని అక్కడ నుంచి సమీపంలోనే ఉన్న కురుపురం చేరుకోవచ్చు. కురుపురం ఒక ద్వీపంలో ఉంది. చుట్టూ కృష్ణా నది. ఈ నది దాటితే స్వామి వారి ఆలయం ఉంది. శ్రీపాద శ్రీవల్లభులు చాలా సంవత్సరాలు కురుపురంలో తపస్సు చేశారు. శ్రీపాద శ్రీ వల్లభ స్వామి తపస్సు చేసిన ఈ ప్రాంతంలో ఒక చిన్న ఆలయం ఉంది. సమీపంలోనే వాసుదేవానంద సరస్వతి స్వామి వారు తపస్సు చేసిన గుహ, శివాలయం దర్శించుకోవచ్చు. కురు మహారాజుకు జ్ఞాన సిద్ది కలిగిన ప్రదేశం కాబట్టి కురుపురమనే పేరు వచ్చింది. దీనికి సమీపంలోనే పంచదేవ పహాడ్ ఉంది. మక్తల్ మండలంలో ఉన్న ఈ క్షేత్రంలో పాండురంగ స్వామి, శ్రీలక్ష్మీనరసింహ స్వామి, ఆంజనేయ స్వామి, రాఘవేంద్ర స్వామి, వినాయకునితో పాటు అనఘ దత్త దేవాలయాలు ఒకే చోట దర్శనమిస్తాయి.

**ఆంజనేయ స్వామి ఆలయం, బీచుపల్లి**

మహబూబ్ నగర్ జిల్లా ఇటిక్యాల మండలం కృష్ణా నది ఒడ్డున బీచుపల్లి గ్రామంలో వెలసిన మహిమాన్విత ఆలయమిది. పదహారవ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం, తొమ్మిదవ శతాబ్దానికి చెందిన చోళ రాజ్యంలో ప్రాచుర్యం పొందిందని ఇక్కడి చారిత్రక ఆధారాల ద్వారా అవగతమవుతోంది. ఇక్కడ స్వామిని బీచుపల్లిరాయుడని భక్తులు భక్తితో పిలుచుకుంటారు. ఇక్కడ ఈ ఆలయంలో స్వామివారి మొదటి పూజను బోయవారు చేయడం ఈ ఆలయం విశేషంగా చెబుతారు. స్వామి వారి ఆదేశం మేరకు ఈ సంప్రదాయం ఇలా కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఇక్కడ స్వామివారిని వ్యాస రాయల వారు ప్రతిష్ఠించినట్లు ఇక్కడి స్థల పురాణాలు చెబుతున్నాయి. అలాగే రెండు శతాబ్దాల క్రితం గద్వాల రాజులు ఈ ఆలయాన్ని పునర్నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా అవగతమవుతోంది. గర్భాలయంలో స్వామివారి మూర్తితోపాటు ఎడమ వైపున మహేశ్వర లింగం, కుడివైపున సీతా లక్ష్మణ సహిత శ్రీరాముడు కొలువుదీరి ఉన్నారు.

**సోమేశ్వర స్వామి ఆలయం, సోమశిల:**

మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్ గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సోమశిలలో సోమేశ్వర స్వామి ఆలయం ఉంది. ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి అందాల నేపథ్యంగా అలరారుతున్న ఈ దివ్యాలయం ప్రాంగణంలోని కృష్ణా నదిలో పుష్కర స్నానాదికాలు చేస్తే విశేష పుణ్యఫలాలు సొంతమవుతాయని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. సోమశిలలోని శ్రీలలితా









సోమేశ్వర స్వామి దేవాలయాన్ని ఏడవ శతాబ్దంలో నిర్మించినట్లు చెబుతారు. శ్రీశైలం ప్రాజెక్టు వల్ల ఈ ఆలయం నదిలో మునిగిపోకుండా గట్టున ఆలయాన్ని తిరిగి పునర్నిర్మించారు. ఈ ఆలయం పదిహేను ఆలయాల సముదాయంగా విరాజిల్లుతోంది. జ్యోతిర్లింగాలుగా ప్రసిద్ధమైన ద్వాదశ లింగాల ప్రతిరూపాలను ఒకే చోట ఆలయంలో ప్రతిష్టించారు. ఈ ఆలయాలలోని అన్ని గర్భగుడుల లలాట బింబంగా గజలక్ష్మి ఉండడం ఈ ఆలయ విశేషంగా చెబుతారు. ఆలయం ముందు భాగంలో రెండు శాసనాలున్నాయి. కళ్యాణి చాళుక్య చక్రవర్తి త్రైలోక్య మల్ల ఒకటవ సోమేశ్వరుని పాలన కాలంలో, కాకతీయ మహారాజు రెండో ప్రతాప రుద్రుని కాలంలోనూ ఈ శాసనాలు వేసినట్లు ఇక్కడి ఆధారాల ద్వారా అవగతమవుతోంది.

**అలంపురం ఆలయాలు**

అలంపురం సమీపంలో కృష్ణా, తుంగభద్ర నదులు సంగమించడం వల్ల ఈ ప్రాంతాన్ని దక్షిణకాశిగా అభివర్ణిస్తూ ఉంటారు. మహబూబ్‌నగర్‌కి 90 కిలోమీటర్ల దూరంలోనూ, హైదరాబాద్‌కి 200 కిలో మీటర్ల దూరంలోనూ నెలకొని ఉన్న అలంపురం అష్టాదశ శక్తి పీఠాల్లో ఐదవది. అలాగే, ఈ క్షేత్రంలో నవ బ్రహ్మలు కొలువై ఉన్నారు. క్రీస్తు శకం ఏడవ శతాబ్దంలో బాదామీ చాళుక్యులు ఈ ఆలయాలను నిర్మించారు. అలంపురం చుట్టూ నల్లమల అడవులు వ్యాపించి ఉన్నాయి. తుంగభద్ర నది ఎడమ గట్టున అలంపురం ఆలయం ఉంది. శాతవాహన, బాదామీ చాళుక్యులు, కాకతీయులు, విజయనగర సామ్రాజ్యాధిపతులు, గోల్కొండకి చెందిన కుతుబ్ షాహీ ల కాలంలో ఈ ఆలయం అభివృద్ధి చెందింది. జోగులాంబ, బ్రహ్మేశ్వరస్వామి వార్ల ఆలయాలు చారిత్రక ప్రసిద్ధి చెందినవి. అలంపురాన్ని పూర్వం హలంపురంగానూ, హటాంపురంగానూ వ్యవహరించేవారని క్రీస్తు శకం 1101 సంవత్సరం నాటి శాసనం తెలియజేస్తోంది. ఈ శాసనం పశ్చిమ చాళుక్య రాజు త్రిభువనమల్ల విక్రమాదిత్య–4 కాలం నాటిది. జోగుళాంబ ఆలయం అలంపురంలో ఆగ్నేయ దిశగా నెలకొని ఉంది. ఈ ఆలయాన్ని 14వ శతాబ్దంలో బహమనీ సుల్తానులు ధ్వంసం చేయగా, జోగులాంబ, చండి, ముండి విగ్రహాలను బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో భద్రపర్చారు. కొద్ది సంవత్సరాల క్రితం జోగులాంబ ఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. సతీదేవికి చెందిన పై దవడ పంటితో సహా ఇక్కడ పడినట్టు పురాణకథనం. అమ్మవారు ఉగ్రరూపంతో దర్శనమిస్తారు. మొదట అమ్మవారి విగ్రహం ఇక్కడున్న బాల బ్రహ్మేశ్వరాలయంలో ఉండేది. 2008లో అమ్మవారికి ప్రత్యేకంగా ఆలయాన్ని నిర్మించి, తిరిగి ప్రతిష్టించారు. అలంపూర్‌కు ఈశాన్యంలో కృష్ణా, తుంగభద్ర నదుల సంగమ ప్రాంతంలో కూడవెల్లి అనే గ్రామంలో సంగమేశ్వరాలయం ఉండేది. ఈ గ్రామం, ఆలయం శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురికావడంతో ఇక్కడి సంగమేశ్వరాలయాన్ని తరలించి అలంపూర్‌లో పునర్నిర్మించారు. ఈ ఆలయ శిల్పసంపద ఆకట్టుకుంటుంది. ఈ దేవాలయం కూడా చాళుక్యుల నిర్మాణ శైలిలోనిదే. అలాగే, అలంపురం సమీపంలోని పాపనాశంలో ఇరవై దేవాలయాలు ఒకేచోట ఉండటం వల్ల అలంపురం ఆలయాల పట్టణంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఏడవ శతాబ్ది నుంచి 17వ శతాబ్ది వరకూ దక్షిణాపథాన్ని పరిపాలించిన రాజవంశీయుల శాసనాలు ఇక్కడ ఉన్నాయి. ప్రాచీన శిల్పకళకు కాణాచి అయిన ఈ ఆలయం అడుగడుగునా విజ్ఞాన విశేషాలకు ఆలవాలంగా ఉంది. వైదిక మతానికి చెందిన ఆలయాలు, జైన, బౌద్ధుల కాలం నాటి శిల్పనిర్మాణాలు ఇక్కడ ఎన్నో దర్శనమిస్తాయి. ఈ ఆలయం మహాద్వారాన్ని రాష్ట్ర కూటుల హయాంలో నిర్మించినట్టు చారిత్రక కథనం. కాకతీయుల కాలంలో ఇక్కడ మండపాలను నిర్మించారు. శ్రీకృష్ణ దేవరాయలు రాయచూర్ నుంచి ఈ ఆలయానికి వచ్చి అనేక మాన్యాలిచ్చినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

**శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, మట్టంపల్లి, నల్గొండ జిల్లా**

నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ సమీపంలోని మట్టంపల్లి గ్రామంలో కృష్ణా నదీ తీరాన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నాడు. తెలుగునాట పంచ నారసింహ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన పుణ్య క్షేత్రమే మట్టపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం. ఈ ఆలయానికి దాదాపు వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. మట్టపల్లిలో వెలసిన స్వామి కొన్నాళ్లు ఎవరికీ కనిపించకుండా గుహలో దాగి ఉండేవాడట. ఇదే గుహలో భరద్వాజ మహర్షి తపస్సు చేయడంతో ప్రత్యక్షమైన స్వామి ఇక్కడే వెలిశాడని, ఒక్క భరద్వాజ మహర్షి మాత్రమే అప్పట్లో స్వామివారిని ఆరాధించుకునేవారని ప్రతీతి. ఈ ఆలయంలో దేవనాగరి లిపిలో ఉన్న శిలాశాసనం ఆధారంగా ఈ ఆలయం 1100 సంవత్సరాల కిందటిదని తెలుస్తోంది. కొండ మీద స్వామి స్వయంభువుగా వెలిశాడు. ఇక్కడ స్వామితో పాటే ఒక దక్షిణావృత శంఖం కూడా ఆవిర్భవించింది. గుంటూరు జిల్లాలోని తంగెడ గ్రామానికి చెందిన మాచిరెడ్డి అనే భక్తుడికి స్వామి కలలో కనిపించి, తాను ఇక్కడ కొండగుహలో వెలిశానని, తనను వెలికితీసి, పునఃప్రతిష్టించమని ఆదేశించాడట. ఆ భక్తుడు గుహలోనున్న స్వామి విగ్రహాన్ని వెలికితీసి, ఆలయం నిర్మించినట్లు ఇక్కడి స్థలపురాణాలు చెబుతున్నాయి. నాటి నుంచి ఈ ఆలయంలో రాజ్యలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామిని భక్తులు పూజించడం మొదలైంది. ఈ ఆలయంలో స్వామివారికి ప్రీతిపాత్రమైన ఆరె ఆకులను దండలుగా చేసి అలంకరిస్తారు. పశ్చిమాభిముఖంగా ఉన్న స్వామివారి గుహాలయానికి ఆనుకుని గోదాదేవి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, నాగేశ్వర ఆలయం తదితర ఆలయాలు ఉన్నాయి. ఈ క్షేత్రానికి యమమోహిత క్షేత్రమని కూడా పేరుంది. యమధర్మరాజు స్వయంగా ఈ ఆలయంలో స్వామి వారి చుట్టూ ప్రదక్షిణలు చేయడం వల్ల దీనికాపేరు వచ్చిందంటారు.

హైద్రాబాద్ నుంచి వచ్చే భక్తులు రోడ్డు మార్గంలో కోదాడ వరకు వచ్చి అక్కడ నుంచి ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు. అలాగే మిర్యాలగూడ మీదుగా కూడా ఇక్కడకు చేరుకోవచ్చు.

**శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం, దామెరచర్ల**

నల్గొండ జిల్లా దామెరచర్ల మండలంలో విష్ణుపురానికి సమీపంలో కృష్ణా, మూసీ నదుల సంగమ క్షేత్రంలో వెలసిన పుణ్య క్షేత్రమిది. ఇదో ప్రాచీన మహానగరం. 11,12 శతాబ్దాల కాలంలో ఈ క్షేత్రం గొప్ప ఓడరేవుగా ఉండేదని, వోడపల్లి కాలక్రమంలో వాడపల్లిగా, వజీరాబాద్ గా మారిందని చెబుతారు. అలాగే ఈ ప్రాంతాన్ని పూర్వం బదరికారణ్యం అని పిలిచేవారు. ఆరు వేల సంవత్సరాలకు పూర్వం అగస్త్య మహాముని, తన ధర్మపత్ని లోపాముద్రతో శివకేశవులను తన పూజా కావిడిలో ఉంచుకుని, వారిని ప్రతిష్టించే పవిత్ర ప్రదేశం కొరకు ముల్లోకాలు తిరుగుతూ భూలోకం చేరారట. ఉత్తరకాశీకి వెళ్ళే క్రమంలో ఈ బదరికారణ్యాన్ని చేరుకున్నారట. ఈ పవిత్ర క్షేత్రంలోకి రాగానే నరసింహ స్వామి తానా ప్రదేశంలోనే ఉండ దలచినట్లు ఆకాశవాణి వినిపించిందట. అంతట ఆ ముని దంపతులు శ్రీ లక్ష్మీసమేతునిగా నరసింహుని ప్రతిష్ఠించి ఈ క్షేత్ర పవిత్రతను ఇనుమడింప చేశాడని ఇక్కడి స్థల పురాణాల ద్వారా అవగతమవుతోంది. మరో కథనం మేరకు వ్యాస భగవానుడి కోరిక మేరకు లక్ష్మీనరసింహ స్వామి ఈ క్షేత్రంలో కొలువుదీరినట్లు చెబుతారు. ఈ ఆలయం దక్షిణ ముఖంగా ఉంటుంది. విష్ణుకుండినులు, చాళుక్యులు, కుందూరు చోళులు, రేచర్ల పద్మ నాయకులు, రెడ్డి రాజులు ఈ ప్రాంతాన్ని పాలించినట్లు తెలుస్తోంది. శిథిలమైన ఆలయాన్ని 13వ శతాబ్దంలో అనవేమారెడ్డి పునర్నిర్మాణం చేసి వసతులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఎరయ తొండయ చోళుడు క్రీ.శ. 1050, 1065 మధ్య అద్భుతమైన వాడపల్లి దుర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. 12వ శతాబ్దంలో రెడ్డి రాజులు ఈ ప్రదేశంలో పట్టణ నిర్మాణానికై తవ్వకాలు జరుపుతుండగా స్వామి వారి విగ్రహం బయట పడిందని, వారు అక్కడే ఆ విగ్రహాన్ని ప్రతిష్టించి క్రీ.శ. 1377లో ఆలయ నిర్మాణం చేసినట్లు శాసనాల ద్వారా అవగతమవుతోంది.

**పుష్కరాల సమయంలో దర్శించుకోదగ్గ ఇతర ఆలయాలు**

వీటితో పాటు మాగనూరు మండలం తంగిడి పుష్కర ఘాట్ సమీపంలోని వల్లభేశ్వరస్వామి ఆలయం, దత్తాత్రేయస్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి, గుడెబల్లూరు ఘాట్ స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి, మక్తల్ మండలం పస్పుల ఘాట్ సమీపంలోని శ్రీదత్తాత్రేయస్వామి . పరెవుల ఘాట్ సమీపంలోని శంకర లింగేశ్వర స్వామి ఆలయాలు దర్శించుకోవచ్చు. అలాగే ఆత్మకూరు మండలం నందిమళ్ల ఘాట్ సమీపంలోని శివాలయం, మూలమళ్ల ఘాట్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం, జూరాల ఘాట్ దగ్గర శివాలయాలు. పెబ్బేరు మండలం రంగాపూర్ ఘాట్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకునే వీలుంది. ధరూర్ మండలం పెద్దచింతరేవుల ఘాట్ ఆంజనేయస్వామి ఆలయం, వీపనగండ్ల మండలం పెద్దమరూర్ ఘాట్ ఈశ్వర ఆలయం, జటప్రోలు మదనగోపాల స్వామి, కొల్లాపూర్ మండలం సింగోటం శ్రీలక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయం, శ్రీ అగస్తేశ్వర ఆలయాలు కూడా పుష్కరాల సమయంలో దర్శించుకోవచ్చు. అలాగే, అమరగిరి ఘాట్ అమరేశ్వర ఆలయం, పెబ్బేరు మండలం గుమ్మడం ఘాట్ సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయం, రామ్‌పూర్ ఘాట్ శ్రీరామాలయం, ముంగమందిన్నె ఘాట్ శ్రీ ఆంజనేయస్వామి, రామాలయాలు. వీపనగండ్ల మండలం చెల్లపాడు ఘాట్ శివాలయం, కొల్లాపూర్ మండలం మంచాలకట్ట, మల్లేశ్వరం ఘాట్ సమీపంలోని శ్రీ రామతీర్థస్వామి ఆలయం, శివాలయం. అచ్చంపేట మండలం పాతాళగంగ పుష్కరఘాట్ దగ్గర్లోని దత్తాత్రేయ స్వామి ఆలయాలను దర్శించుకోవచ్చు. వీటితో పాటు ధరూర్ మండలం నెట్టెంపాడు శివాలయం, ఉప్పేరు, రేవులపల్లి ఘాట్ సమీపంలోని శివాంజనేయస్వామి ఆలయాలు, గద్వాల మండలం రేకులపల్లి ఘాట్ ఆంజనేయస్వామి ఆలయం, నదీ అగ్రహారం రామావధూత మఠం, బీరెల్లి చెన్నకేశవస్వామి ఆలయాలు, అలంపూర్ మండలం క్యాతూరు వెంకటేశ్వరస్వామి ఆలయం, గొందిమళ్ల ఘాట్ సమీపంలోని జూంకారేశ్వరీదేవి ఆలయాలు కూడా పుష్కర సమయంలో దర్శించుకునే మహాద్భాగ్యం కలుగుతుంది.

# జన్మనక్షత్ర పాదమును బట్టి శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం



**హరిః ఓమ్..**

అశ్వని 1వ పాదం

విశ్వం విష్ణు ర్వషట్కారో భూత భవ్య భవత్ ప్రభుః 01
భూతకృత్ భూతభృద్భావో భూతాత్మా భూతభావనః

అశ్వని 2వ పాదం
పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమాగతిః 02
అవ్యయః పురుష స్సాక్షీ క్షేత్రజ్ఞో క్షర ఏవచ

అశ్వని 3వ పాదం
యోగో యోగవిదాం నేతా ప్రధాన పురుషేశ్వరః 03
నారసింహవపు శ్రీమాన్ కేశవః పురుషోత్తమః

అశ్వని 4వ పాదం
సర్వ శ్శర్వ శ్శివ స్థాణుః భూతాది ర్నిధి రవ్యయః 04
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః

భరణి 1వ పాదం
స్వయంభూ శ్శంభు రాదిత్యః పుష్క రాక్షో మహాస్వనః05
అనాదినిదనో ధాతా విధాతా ధాతు రుత్తమః

భరణి 2వ పాదం
అప్రమేయో హృషీకేశః పద్మనాభో మరప్రభుః 06
విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠః స్థవి రో ధ్రువః

భరణి 3వ పాదం
అగ్రాహ్య శ్శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః 07
ప్రభూత స్త్రికకుద్ధామ పవిత్రం మంగళం పరమ్

భరణి 4వ పాదం
ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః 08
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః

కృత్తిక 1వ పాదం
ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః 09
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతి రాత్మవాన్

కృత్తిక 2వ పాదం
సురేశ శ్శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః 10
అహ స్సంవత్సరో వ్యాళః ప్రత్యయ స్సర్వదర్శనః

కృత్తిక 3వ పాదం
అజ స్సర్వేశ్వర స్సిద్ధః సిద్ధి స్సర్వాది రచ్యుతః 11
వృషాకపి రమేయాత్మా సర్వయోగ వినిస్సృతః

కృత్తిక 4వ పాదం
వసు ర్వసుమనా స్సత్యః సమాత్మా సమిత స్సమః 12
అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః

రోహిణి 1వ పాదం
రుద్రో బహుశిరా బభ్రుః విశ్వయోని శ్శుచిశ్రవాః 13
అమృత శ్శాశ్వతః స్థాణుః వరారోహో మహాతపాః

రోహిణి 2వ పాదం
సర్వగ స్సర్వవిద్భానుః విష్వక్సేనో జనార్దనః 14
వేదో వేదవి దవ్యంగో వేదాంగో వేదవిత్ కవిః

రోహిణి 3వ పాదం
లోకాధ్యక్ష స్సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాకృతః 15
చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్ర శ్చతుర్భుజః

రోహిణి 4వ పాదం
భ్రాజిష్ణు ర్భోజనం భోక్తా సహిష్ణు ర్జగదాదిజః 16
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః

మృగశిర 1వ పాదం
ఉపేంద్రో వామనః ప్రాంశుః అమోఘ శ్శుచి రూర్జితః 17
అతీంద్ర స్సంగ్రహ స్సర్గో ధృతాత్మా నియమో యమః

మృగశిర 2వ పాదం
వేద్యో వైద్య స్సదాయోగీ వీరహా మాధవో మధుః 18
అతీంద్రియో మహామాయో మహోత్సాహో మహాబ లః

మృగశిర 3వ పాదం
మహాబుద్ధి ర్మహావీర్యో మహాశక్త ర్మహాద్యుతిః 19
అనిర్దేశ్యవపు శ్రీమాన్ అమేయాత్మా మహాద్రిధృత్

మృగశిర 4వ పాదం
మహేష్వాసో మహీభర్తా శ్రీనివాస స్సతాంగతిః 20
అనిరుద్ధ స్సురానందో గోవిందో గోవిదాం పతిః

ఆరుద్ర 1వ పాదం
మరీచి ర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః 21
హిరణ్యనాభ స్సుతపాః పద్మనాభః ప్రజాపతిః

ఆరుద్ర 2వ పాదం
అమృత్యు స్సర్వదృక్ సింహః
సంధాతా సంధిమాన్ స్థిర ?